

# మహిమాన్వితం.. బాసర క్షేత్రం..!

15

■ నేటి నుంచి 'వసంత' వేడుకలు ■ ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయాధికారులు ■ భారీగా తరలి రానున్న భక్తులు

నిర్మల్ జిల్లా బాసరలోని శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయం వసంత పంచమి వేడుకలకు ముస్తాబైంది. నేటి నుంచి ఈ నెల 23వరకు అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిల, ఎమ్మెల్యే రామారావు పటేల్ ఇక్కడి ఏర్పాట్లు పర్యవేక్షించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానుండగా అధికారులు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి అన్ని రకాల వసతులు కల్పించారు. పకడ్బందీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ బుధవారం | 21 జనవరి 2026 | ■ 16 పేజీలు


■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

పురపోరుకు నేడో.. రేపో నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండటంతో రాజకీయం రోజురోజుకు వేడెక్కుతోంది. ఎక్కడ చూసినా డివిజన్, వార్డుల రిజర్వేషన్‌లపైనే చర్చ జరుగుతోంది. రిజర్వేషన్‌లలో అవకాశం కోల్పోయిన నాయకులు చాలామంది సైలెంట్‌అవగా, రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చిన వారు ఇప్పటికే గల్లీల్లో ఇంటింటికి వెళ్లి ఓటర్ల మద్దతు కోరుతున్నారు. రిజర్వ్ స్థానాలలోనే తీవ్ర పోటీ నెలకొంది. టికెట్ తమకే వస్తుందనుకున్న నాయకులు ధీమాతో ప్రచారం మొదలుపెట్టగా, పోటీ ఉన్న చోట మాత్రం ఆయా పార్టీల ముఖ్య నాయకుల అనుగ్రహం కోసం ఆశావహులు తిరుగుతున్నారు. టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీ కార్యాలయాల వద్ద సందడి మొదలైంది. టికెట్ కోసం ముఖ్య నాయకులకకు దగ్గరగా ఉన్న వారితో లాబీయింగ్ చేస్తున్నారు. అనుకూలంగా ఉన్నవారితో మాట్లాడించి టికెట్ వచ్చేలా చేయాలని కోరుతున్నారు. అన్ని డివిజన్‌లలో ఇప్పటికే ప్రచారం షురూ అయింది. కాంగ్రెస్ పార్టీలో మైనారిటీలు ఎక్కువగా టికెట్ ఆశిస్తున్నారు. పార్టీలో ఉన్న ముఖ్య నాయకుల ఆశీస్సుల కోసం ఆశావహులు చేస్తున్న ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు.

# ఆశావహుల పైరవీలు

11




■ టికెట్ల కోసం నాయకుల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణ
■ ముఖ్యులకు, దగ్గరగా ఉన్నవారితో మంతనాలు షురూ
■ పోటీకి డివిజన్లలో చర్చలు ■ టికెట్ ఖాయమన్న ధీమా ఉన్నవారు ప్రచారం షురూ..
■ గెలుపు గుర్రాల కోసం పార్టీల అన్వేషణ ■ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల్లో తీవ్ర పోటీ
■ రిజర్వేషన్ అనుకూలించని అభ్యర్థులు ఇతర వార్డుల కోసం అన్వేషణ..
మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో టికెట్ల కోసం ఆశావహుల ముమ్మర ప్రయత్నాలు
■ ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు..
■ టికెట్ వస్తుందన్న నమ్మకంతో పలకరింపులతో ఎన్నికల ప్రచారం మొదలు..




## మంచిర్యాల జిల్లాలో సీఐల బదిలీ

■ నిన్న ఎస్సైలు, నేడు సీఐల బదిలీలు

## 48 గంటలు.. 1000 కిలో మీటర్లు




■ రెండు రోజుల్లోనే వెయ్యి కిలోమీటర్ల మేర మంత్రి జూపల్లి కృష్ణారావు సుదీర్ఘ ప్రయాణం
■ ఒకే రోజులో ఉమ్మడి ఆదిలాబాద్‌లోని నాలుగు జిల్లాలో మంత్రి జూపల్లి సుడిగాలి పర్యటన
■ అర్ధరాత్రి ఒంటి గంటకు నిర్మల్ కలెక్టరేట్‌లో బస

## దారికాచిన మృత్యువు

ప్రభాత సమాచారం, ముథోల్

నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని కుప్టి గ్రామం అంటే కేవలం ఇళ్లు, మనుషుల సమూహం మాత్రమే కాదు.. అదొక పెద్ద ఉమ్మడి కుటుంబం. గ్రామంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా, ఏ శుభకార్యం జరిగినా 'మేమంతా ఉన్నాం' అంటూ గ్రామ పెద్దలు ముందుంటారు. గ్రామానికి చెందిన ఓ బాలుడు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. ఆ తల్లిదండ్రులకు ధైర్యం చెప్పాలని సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ పెద్దలు నిర్ణయించుకున్నారు. కారులో హైదరాబాద్ వరకు వెళ్లారు. సోమవారం అర్ధరాత్రి తిరిగి వస్తుండగా భైంసా పట్టణ శివారులోని సాత్పూల్ వంతెన వద్ద చీకటిని చీల్చుకుంటూ వస్తున్న కారుకు ఎదురుగా వస్తున్న లారీలోని ఐరన్ డోమ్ మృత్యుపాశంలా మారి కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

■ లారీలోని ఐరన్‌డోమ్‌ను ఢీకొట్టిన కారు
■ ప్రమాద స్థలిలోనే నలుగురి దుర్మరణం
■ మృతుల్లో ముగ్గురు కుప్టివాసులు
■ ప్రాణాపాయ స్థితిలో గ్రామ సర్పంచ్ గంగాధర్
■ హైదరాబాద్ వెళ్లి తిరిగివస్తుండగా ఘటన
■ కుప్టి గ్రామంలో తీరని విషాదం ఛాయలు



14

## నాగోబాకు ప్రణమిల్లి

13

■ దారులన్నీ నాగోబా వైపే ■ జనసంద్రమైన కేస్లాపూర్
■ మెస్రం వంశ కొత్త కోడళ్లకు గోవాడలో కిక్రి వాయిస్తూ పాటల రూపంలో పెద్దల బోధనలు
■ నాగోబాను దర్శించుకున్న మంత్రి సీతక్క..
■ నేడు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రాక..



నాగోబా జాతరలో భాగంగా రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మంగళవారం రాత్రి కేస్లాపూర్ చేరుకున్నారు. నాగోబా ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధి, సౌకర్యాల కల్పనకు ప్రత్యేక కృషి చేస్తుందన్నారు.

# నిబంధనలు పాటిస్తే.. ప్రమాదాలు అరికట్టవచ్చు

■ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం ప్రభాకర్ రావు
■ రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యం
■ ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
■ ప్రతీ ఒక్కరురోడ్డు భద్రతా నియమాలు పాటిద్దాం
■ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
■ ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం









**ఆదిలాబాద్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మంగళవారం జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో జిల్లాలో 'అరైవ్ అలైవ్' అనే కార్యక్రమాన్ని ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నందు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, వాహనదారులు, డ్రైవర్లు, డ్రైవర్ యూనియన్లు, ప్రజలు, వ్యాపారస్తులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు నుండి 10 రోజులపాటు జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు వాటిక అనుకూలంగా పలు ప్రజాహిత కార్యక్రమాలను జిల్లా పోలీసు శాఖ నిర్వహించనున్నట్లు అందులో ప్రజలు, వాహనదారులు, డ్రైవర్లు, పెద్ద ఎత్తున పాల్గొని రోడ్డు ప్రమాదాలలో ప్రాణ నష్టాన్ని తగ్గిద్దామని సమిష్టి కృషితో సాధ్యమవుతుందని పోలీసు శాఖ ఈ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ఇందులో భాగంగాఁ మంగళవారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ, ప్రమాదాలను నివారిస్తూ, ప్రాణ నష్టాన్ని తగ్గించాలని తెలియజేశారు. విద్యార్థులకు తెలిపిన సూచనలను, నియమాలను తల్లిదండ్రులకు తెలియజేసి వాటిని పాటించేలా ప్రోత్సహించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేకమైన చర్యలను చేపడుతూ ప్రజలకు చేరువ కావాలని సూచించారు. ప్రజలు ప్రతి ఒక్కరూ వాహన నియమ నిబంధనలు పాటిస్తూ ఇతరులు పాటించే విధంగా ప్రోత్సహించాలని ఇతరులకు ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ డిఫెన్సివ్ డ్రైవింగ్‌తో ప్రమాదాలను తగ్గించవచ్చని ఒకవేళ ప్రమాదం సంభవించిన ప్రాణనష్టాన్ని తక్కువ చేసేలా డిఫెన్సివ్ డ్రైవింగ్‌ను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని వాటిని పాటించేలా అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజలు ప్రోత్సహించాలని తెలిపారు. ఈ సంవత్సరం జిల్లాలో 20% శాతం రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు జిల్లా పోలీసు శాఖ కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలను ఇవ్వవద్దని, 18 సంవత్సరాలు నిండని వారికి వాహనాలు నడిపే శక్తి ఆత్మస్థైర్యం మెలుకువలు ఉండవని తెలిపారు. సరైన సమయంలో లైసెన్స్‌ని పొంది వాహనాలను నడపాలని సూచించారు. త్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, రేష్ డ్రైవింగ్, లాంటివి జరగకుండా చేయకుండా ఉండాలని తెలిపారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ప్రాణం పోతే తిరిగి రాదని వాహన నియమ నిబంధనలు పాటిస్తూ ప్రజలు వాహనాలు నడపాలని తెలిపారు. ముఖ్యంగా రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసు శాఖ చేపడుతున్న నిర్ణయాలను అభినందించారు. ట్రాఫిక్ పోలీస్ కటౌట్, హాట్స్పాట్ ల వద్ద తనిఖీలు చేస్తూ రాంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయడం, జిగ్జాగ్ పద్ధతి ద్వారా డ్రమ్స్ ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను అరికడుతున్న తీరును ప్రశంసించారు. మండలాలు వారిగా ప్రత్యేక లైసెన్స్ మేళాను ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రశాంత్ బాజీరావు పాటిల్, జిల్లా అదనపు సెషన్స్ న్యాయమూర్తి సీఎం రాజ్యలక్ష్మి, అదనపు కలెక్టర్ శ్యామల దేవి, పరిపాలన ఏఎస్పి పి మౌనిక, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, పీపీ సంజయ్ వైరాగరి, డిసిసి అధ్యక్షుడు నరేష్ జాదవ్, మాజీ డిసిసి చైర్మన్ అడ్డి భోజరెడ్డి, ఐఎంఏ ఆదిలాబాద్ అధ్యక్షుడు కళ్యెం వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సుజాత, కళాశాల విద్యార్థులు, ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు, డ్రైవర్లు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పోలీసు సిబ్బంది పోలీసు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ ప్రార్థనల కోసం చర్యలు తీసుకోవాలి

■ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





**నిర్మల్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రంజాన్ మాసంలో చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులు, ముస్లిం మత పెద్దలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రంజాన్ నెలలో మసీదుల దగ్గర నిరంతరం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మసీదుల దగ్గర ప్రార్థనా సమయాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. మసీదుల పరిసర ప్రాంతాల్లో అవసరమైన చోట రోడ్లకు మరమ్మత్తులు చేయాలని, పార్కింగ్ సమస్యలు ఏర్పడకుండా చూడాలన్నారు. మసీదులలో ఎప్పుడూ త్రాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రార్థనా సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. రంజాన్ మాసంలో ముస్లింలకు ఏవైనా సమస్యలు ఎదురైతే అధికారులు త్వరితగతిన స్పందించి, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. మసీదుల పరిసర ప్రాంతాల్లో ఏవైనా సమస్యలు ఉంటే వాటి వివరాలు తెలిపేందుకు క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేస్తామని, దీని ద్వారా సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. రంజాన్ పండుగనాడు అన్ని ఈద్గాలలో ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా చర్యలు చేపట్టాలన్నారు. ఈద్గాలలో త్రాగునీరు, షామియానాలు, ఇతర ఏర్పాట్లను చేయాలన్నారు. పిచ్చి మొక్కలు, పొదలు తొలగించి, ఈద్గా పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, మైనారిటీ అధికారి మోహన్ సింగ్, ఆర్డీవో రత్నకళ్యాణి, ముస్లిం మతపెద్దలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# చిట్టి చేతులతో పాఠశాలలో వెట్టి చాకిరి

**మంచిర్యాల, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
విద్యాబుద్ధులు నేర్పించాల్సిన చిన్నారి చేతులతో మోయలేని భారాన్ని మోపిస్తున్నారు. మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలంలోని ప్రజ్ఞప్రైవేట్ పాఠశాలలో భవన నిర్మాణానికి ఇసుక తట్టలు నెత్తిన పెట్టి మోస్తున్న విద్యార్థుల వీడియోలు వాట్సాప్ గ్రూపుల్లో చెక్కర్లు కొడుతున్నాయి. దీని పై స్థానిక ప్రజలతో పాటు తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పాఠశాల అనుమతి రద్దు చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ప్రైవేట్ యాజమాన్యం వెట్టిచాకిరి పనులు చేపించడమేంటని ప్రశ్నిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులతో బరువులు మోపించడం పై పాఠశాల ప్రిన్సిపల్ పై విద్యాహక్కు చట్టం ప్రకారం కేసునమోదు చేయాలని అంటున్నారు. తమ పిల్లలతో ఇంటి వద్ద కూడా ఇలాంటి పనులు ఎప్పుడు చేయించలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ ప్రజ్ఞ ప్రైవేట్ స్కూల్ ఇష్టారీతిన వ్యవహరిస్తుందని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఇక రెండేళ్ల క్రితం ఇదే పాఠశాలకు చెందిన ఓ పాఠశాల బస్సు మెట్పల్లిలో విద్యార్థులతో వెళుతూ ప్రమాదానికి గురైందని చెప్పకొస్తున్నారు. ఓ ప్రైవేట్ వ్యక్తి బస్సు నడపడంతో ప్రమాదం చోటుచేసుకుందన్నారు. ఈ పాఠశాల నడుపుతున్న ఇద్దరు అన్నదమ్ములు అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు, విద్యార్థులకు చదువు చెప్పకుండా వెట్టిచాకిరి చేయించడంపై కలెక్టర్ స్పందించి కన్నెపెల్లి ప్రజ్ఞ ప్రైవేట్ పాఠ శాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# దావోస్‌లో సీఎంను కలిసిన లక్ష్మణచాంద యువకులు

**లక్ష్మణచాంద, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
మండలంలోని లక్ష్మణచాంద గ్రామానికి చెందిన సురకంటి ముత్యం రెడ్డి తనయుడు సురకంటి భీమ్ రెడ్డి స్నేహితులు స్విట్జర్లాండ్‌లో ఎంటెక్ చదువుతున్నారు. ఈ క్రమంలో విద్యార్థులు వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సదస్సు- 2026లో పాల్గొనేందుకు తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం, స్విట్జర్లాండ్ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఆయన వెంట మంత్రులు తదితరులు ఉన్నారు.



# నేను ఇచ్చినప్పుడే తీసుకోండి..!

■ లేదంటే మీ దిక్కున చోట చెప్పుకోండి..
■ లోకేశ్వరం మండలం పిప్రి రేషన్ షాప్ డీలర్ వైనం..




**ముథోల్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
లోకేశ్వరం మండలంలోని పిప్రి రేషన్ షాప్ డీలర్ అక్రమాలకు పాల్పడుతూ.. ప్రశ్నించిన వారిని బెదిరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నెలలో 18 రోజులు తెరిచి ఉంచాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ సమయపాలన పాటించడం లేదని రేషన్ షాప్ ఏ రోజు ఏ సమయంలో తెరిచి ఉంచుతారో తెలియడం లేదని, ప్రశ్నిస్తే మీ దిక్కున చోట చెప్పుకోండి అని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపిస్తున్నారు. తానేమి ప్రభుత్వ ఉద్యోగిని కాదని తెరిచి ఉంచినప్పుడే తీసుకెళ్లాలని దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అలాగే బియ్యం తూకం వేసే సమయంలో ప్రతి వినియోగదారునికి గన్ని బ్యాగ్‌తో పాటు తూకం వేస్తున్నారని దీంతో ఆరు కిలోలు తీసుకున్న వినియోగదారునికి సైతం అర కిలో కోత పెడుతున్నాడని ఆరోపణలు వస్తున్నాయి. అలాగే ఇదే డీలర్‌కు పది కిలోమీటర్ల దూరంలో గల పుస్పూర్ రేషన్ షాపు అదనపు బాధ్యతలు అప్పజెప్పడంతో పని భారంతో అక్కడ కూడా ఆయన ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు ఆ డీలర్‌కు అదనంగా అప్పజెప్పిన పుస్పూర్ రేషన్ షాప్ బాధ్యతలు తొలగించి సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# గ్రామాల సమగ్రాభివృద్ధికి తోడ్పాటు

**నార్నూర్ మండల అభివృద్ధికి రూ.2.78కోట్ల నిధులు - ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**





**నార్నూర్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
ఆరోగ్యకరమైన జీవితానికి స్వచ్ఛమైన నీరు ప్రధానమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం ప్రాజెక్ట్ అమృత్‌లో భాగంగా నార్నూర్ పోలీస్ స్టేషన్ సమీపంలో 'నాంది వాటర్' సౌజన్యంతో ఏర్పాటు చేసిన నూతన వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవితానికి స్వచ్ఛమైన నీరు ప్రధానమని, నాంది వాటర్ సంస్థ సౌజన్యంతో సుమారు రూ.11.61 లక్షలతో నూతన వాటర్ ప్లాంట్‌ను ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నెలకొల్పడం జరిగిందని అన్నారు. అత్యాధునిక ఋబతీవ సాంకేతికతతో ఎటువంటి రసాయనాలు వాడకుండా నీరు శుద్ధి అవుతుందని, ప్రతి నెలా నీటి నాణ్యత పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆస్పిరేషనల్ బ్లాక్ కింద నార్నూర్ మండలాభివృద్ధికి మొత్తం 2.78 కోట్ల నిధులు మంజూరయ్యాయని, మండల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజలింగం, నాంది వాటర్ సిఈఓ దివ్య, సర్పంచ్ కావేరి, గ్రామ ప్రజలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### మోడల్ కామన్ సర్వీస్ సెంటర్

## సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**నార్నూర్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
పీఎంఈజీపీ ద్వారా స్వయం ఉపాధిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం కింద నార్నూర్ మండలం మాలేపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన 'మోడల్ కామన్ సర్వీస్ సెంటర్'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ, డిజిటల్ ఇండియా సహకారంతో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (భీంపూర్ శాఖ) సహకారంతో, స్థానిక లబ్దిదారు రేఖ రూ. 4.20 లక్షల వ్యయంతో ఈ కేంద్రాన్ని నెలకొల్పగా, దీనికి ప్రభుత్వం నుండి రూ. 1.50 లక్షల సబ్సిడీ లభించిందని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా మాలేపూర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు డిజిటల్ సేవలు చేరువవుతాయన్నారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులతో ముచ్చటించి వారికి నోట్ బుక్స్, పెన్నులు అందజేశారు.కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు పాల్గొన్నారు.



## మహిళలు పురుషులతో సమానంగా రాణించాలి



**బజార్‌హత్నూర్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఏపీఎం జి వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సహ జ్యోతి మండల సమైక్య కార్యాలయంలో మండలంలోని నూతనంగా ఎన్నికైన మహిళా సర్పంచులకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు స్వయం సహాయక సంఘాల నుండి చైతన్యం పొంది పురుషులతో సమానంగా రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు గంగ సాగర, కార్యదర్శి కనక సరోజా, సర్పంచులు, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలు పాటిస్తేనే సురక్ష జీవితం

### మంచిర్యాల డీసీపీ భాస్కర్



**మంచిర్యాల, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తేనే సురక్షితంగా తమ గమ్యాలకు చేరు కుంటారని డీసీపీ భాస్కర్ అన్నారు. మంచిర్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా లారీ ఆటోడ్రైవర్లకు విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమనిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్, అలైవ్ కార్యక్రమం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా వాహనదారులకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బా ధ్యత ఎంతో కీలకమన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం చట్టపరమైన బాధ్యతే కాదని మన కుటుంబాల భద్రతకు సంబంధించిన అంశమన్నారు. రోడ్డు భద్రతను జీవనశైలిలో భాగం చేసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనం నడుపకుండా ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటిస్తూ తమ కుటుంబాలను, సమాజాన్ని సురక్షితంగా ఉంచాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వైద్యులు సీపీఆర్ చేసే విధానాన్ని కల్పించారు. కార్యక్ర మంలో ఏసీపీ ప్రకాశ్, ఇన్స్పెక్టర్లు ప్రమోద్ రావు, అశోక్, నరేశ్ కుమార్, ఆర్డీవో గోపినాథ్, కుమారస్వామి పాల్గొన్నారు.



### మైనార్టీ గురుకులాలలో

## ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
జిల్లాలోని మైనారిటీ గురుకుల విద్యాసంస్థలలో ప్రవేశాల కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో గురుకుల విద్యా సంస్థలలో ప్రవేశాలకు సంబంధించిన గోడ ప్రతులను జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైనారిటీ గురుకుల విద్యా సంస్థలలో 5వ తరగతి నుండి ఇంటర్ ప్రథమ సంవత్సరం వరకు ప్రవేశాల కొరకు మైనారిటీ విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఇందు కొరకు ఆన్‌లైన్‌లో tgmreistelangana.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు పొందవచ్చని, వివరాల కొరకు కంట్రోల్ రూమ్ నం.7331170790లో సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలోని మైనారిటీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు ఎండి. తాహేరుద్దీన్, అకాడమీ సమన్వయకర్త రిజ్వాన్, మంచిర్యాల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ మందపెల్లి సంధ్య, చెన్నూర్ పాఠశాల ప్రిన్సిపల్ గోపి, కళాశాల ప్రిన్సిపల్ సమ్మయ్య, బెల్లంపల్లి ప్రిన్సిపల్ నీలు పాల్గొన్నారు.

### విద్యుత్ వినియోగదారులు


## సమస్యలు పరిష్కరించుకోవాలి

**జైనూర్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలో ఈనెల 21న నిర్వహించబోయే విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ వినియోగదారుడు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని. ఏడీఈ డి. శ్రీనివాస్ కోరారు. బుధవారం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కార కార్యక్రమానికి చైర్మన్ నారాయణ, మెంబర్స్ రామకృష్ణ, కిషన్, రాజగౌడ్ వస్తున్నట్లుతెలిపారు. జైనూర్ మండల కేంద్రంగా నిర్వ హించబోయే కార్యక్రమానికి జైనూర్ కెరమెరి, తిర్యాని, సిర్పూర్ (యు), లింగాపూర్ మండలాల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

# కాసిపేటలో వన్యప్రాణి గణన ప్రారంభం

### కేరళ నుంచి వచ్చిన వాలంటీర్లు

**కాసిపేట, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ 2026లో భాగంగా వన్యప్రాణి గణనను ఈ నెల 20 నుంచి 25 తేదీ వరకు చేపట్టనున్నట్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్ తెలిపారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని ముత్యంపల్లి సెక్షన్ పరిధిలో వన్యప్రాణి గణన చేపట్టారు. మూడు బీట్లలో బీటుకు ఇద్దరు చొప్పున వాలంటీర్ల సహాయంతో వన్యప్రాణి గణనను ప్రారంభించారు. మొదటి మూడు రోజులు శాఖాహార జంతువులకు సంబంధించి ట్రాన్సక్ట్ లైన్ సర్వే, రెండు కిలోమీటర్ల పరిధిలో సమాచారం సేకరించడం, అలాగే తర్వాత మూడు రోజులు మాంసాహార జంతువులకు సంబంధించి ట్రైల్ లైన్ సర్వే, ఐదు కిలోమీటర్లు నడిచినప్పుడు వన్యప్రాణుల పాదముద్రలు, విసర్జితాలు, వెంటికలు, చెట్లపై గీసిన గీతలు, భూమిపై పొర్లాడిన అచ్చులు తదితర గుర్తులు ఎం స్ట్రైప్స్ ఎకలాజికల్ యాప్‌లో నమోదు చేస్తారన్నారు. బెల్లంపల్లి రేంజ్ పరిధిలో గల 21 బీట్ల నందు ఈ సర్వే జరుగుతుందని అటవీ క్షేత్ర అధికారి బెల్లంపల్లి సీహెచ్ పూర్ణ చందర్ వివరించారు. ఈ సర్వే ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి పులుల గణన కోసం జాతీయ స్థాయిలో చేపడతారని, ఔత్సాహికులైన వ్యక్తులు ఇందులో మొదటిగానే తమ పేర్లను వాలంటీర్లుగా ఇవ్వడం జరిగిందని, అందులో భాగంగా బెల్లంపల్లి డివిజన్ పరిధిలో ఐదుగురు వాలంటీర్లు హైదరాబాద్ కేరళ నుండి వచ్చారన్నారు. వారికి అన్ని సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. వన్యప్రాణి గణనలో భాగంగా అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అటవీ ప్రాంతంలో అనవసరమైన కార్యకలాపాలు సీసీ కెమెరాలో నమోదైతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




# మున్సిపల్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

■ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు తగు ఏర్పాట్లు చేయాలి ■ కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్సులో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

**మంచిర్యాల, జనవరి 20 (ప్రభాత సమాచారం)**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి మున్సిపల్ శాఖ కార్యదర్శి టి.కె. శ్రీదేవి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు–కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఎన్నికలలో వినియోగించే బ్యాలెట్ బాక్సులు, సామాగ్రి, బ్యాలెట్ ప్రింటింగ్ కు అవసరమైన ఏర్పాట్లు, నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, ఫ్లయింగ్, స్టాటస్టిక్ సర్వేయలెన్స్ బృందాలు, పిఓ, ఓపిఓలకు శిక్షణ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్ లలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు అవసరమైన పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.



జిల్లా ఎన్నికల అధికారి – కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 60 డివిజన్లు, బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో 34 వార్డులు, చెన్నూర్ మున్సిపల్ పరిధిలో 18 వార్డులు, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో 22 వార్డులు, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలో 15 వార్డులకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా వెబ్ కాస్టింగ్, నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, పి ఓ లు, ఓ పి ఓల నియామకం, శిక్షణ, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని, అధికారుల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కుమ్రంభీం జిల్లా కలెక్టర్

**ఆసిఫాబాద్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థాన సముదాయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్ బాబును జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కె.హరిత మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## తపస్ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా వాసులకు చోటు

**నిర్మల్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**



తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని ఇటీవల ప్రకటించింది. నూతనంగా ఎన్నుకోబడిన రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాష్ట్ర బాధ్యుల నియామకంలో భాగంగా నిర్మల్ జిల్లాకు చెందిన ఇద్దరికీ రాష్ట్ర కార్యవర్గంలో సముచిత స్థానం కల్పించారు జిల్లాకు చెందిన జిలకరి రాజేశ్వర్, తిరునగరి నవీన్ కుమార్ రాష్ట్ర సేవా, శిక్షణ కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశారు. జిల్లా వాసులు ఇద్దరికీ రాష్ట్ర కార్యవర్గంలో చోటు లభించడం విశేషం.. జాతీయ వాదం, వృత్తి ధర్మం అనే లక్ష్యాలతో సంఘ అభివృద్ధికి కృషి చేయడానికి ఈ అవకాశం తోడ్పడుతుందని కార్యకర్తలు అభిప్రాయపడ్డారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే రోడ్డు ప్రమాదాలకు చెక్

**వాంకిడి, జనవరి 20 (ప్రభాత సమాచారం)**

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం వాంకిడి మండల కేంద్రంలోని ఆటో స్టాండ్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మోహన్ ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణపై పలు సూచనలు చేస్తూ ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అలాగే డ్రైవర్లతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఎంవీఐ మోహన్ మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, జాతీయ రహదారులపై ఆటోల ప్రయాణానికి విధించిన నిషేధాన్ని గుర్తుంచుకొని వాహనాలు నడపాలని తెలిపారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని,



సరైన కండిషన్‌లో లేని వాహనాలను రోడ్లపైకి తీసుకు రావద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలను నివారించవచ్చున్నారు. కార్యక్రమంలో ఏఎంవీఐలు రాజమల్లు, సంజయ్, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

# అవయవ దానం అత్యున్నతమైన దానం

**బెల్లంపల్లి, జనవరి 20 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి మండలం బుధకలాన్ గ్రామంలో నిర్వహించిన మహిళ సమాఖ్య సమావేశంలో జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో సదాశయా ఫౌండేషన్ సదశయా ఫౌండేషన్ వారి సహకారంతో నేత్ర, అవయవ శరీరదాన అవగాహన సదస్సు జరిగింది. నేత్ర అవయవదాతల అంగీకార పత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకి నేత్ర, అవయవ మరియు శరీరదానం గొప్పదన్నారు. పుట్టిన ప్రతి ప్రాణి గిట్టక తప్పదని, మరణించిన తరువాత నేత్ర, అవయవ, శరీరాలు వృథా కాకుండా దానం చేసి సమాజానికి ఉపయోగపడాలని కోరారు. నేత్ర దానం ద్వారా ఇద్దరు అందులకి చూపు ప్రసాదించి వారి ద్వారా మరణించిన ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం ఉందని ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. బుధకలాన్ సర్పంచ్ నగేష్, ఉప సర్పంచ్ అనసూర్య, వార్డు సభ్యులు రాజన్న, సుధాకర్, సంపత్, స్వప్న, శ్రీనివాస్, మహిళా సంఘం సభ్యులు సుమారు 50 మంది నేత్ర అవయవ



దానానికి అంగీకారం తెలిపారు. వారికి సదశయా ఫౌండేషన్ ద్వారా డోనర్ కార్డులు అందజేశారు. శరీరధానానికి ముందుకు వచ్చిన కోట కరుణాకర్‌ను శాలువతో సత్కరించి డోనర్ కార్డ్ అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి హరిక్రిష్ణ, వెలుగు కో–ఆర్డినేటర్ రాజనాల సుందరేష్ జనహిత సేవా సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కాంపెల్లి విజయ్ కుమార్, కోశాధికారి కొడిపెల్లి గిరిప్రసాద్, గౌరవ సలహాదారులు సింగతి తిరుమల్ కార్యవర్గ సభ్యులు మోటపకుకుల అజయ్ పాల్గొన్నారు.



## సైబర్ మోసాలపై అప్రమతంగా ఉండాలి

**తలమడుగు, జనవరి 20 (ప్రభాత సమాచారం)**

మండలంలోని దేవాపూర్ గ్రామంలో పోలీస్ శాఖ, మావల సి.ఎఫ్.ఎల్ ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్ రవీందర్, సిఎఫచవతీతీచల్ కౌన్సిలర్ కమలాకర్, భూమన్నలు మాట్లాడుతూ... ఏపీకే ఫైల్స్, రివార్డ్ ఫైల్స్, ఫోన్‌కు వచ్చే మెసేజ్‌లు ఓటీపీలకు స్పందించవద్దన్నారు. లక్కీ డ్రా పేరుతో, రుణాలు ఇస్తామని ఆశ చూపి లేదా డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో భయభ్రాంతులకు గురిచేసి సైబర్ నేరాలు అమాయక ప్రజల ఖాతాలు ఖాళీ చేస్తున్నారని అన్నారు. సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అనుమానం ఉన్న సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయాలన్నారు.


## అధ్యాపకులను నియమించండి

**బెజ్జూర్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**

బెజ్జూర్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తహసిల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ బీమ్లా నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. గత మూడు నెలల నుండి బాటనీ అధ్యాపకులు లేక విద్యార్థుల చదువులు వార్షిక పరీక్షలు ప్రాక్టికల్స్ ఇబ్బందిగా మారిందని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు తాహసిల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసిల్దార్ భీమ్లా నాయక్ వినతి పత్రం అందించినట్లు తెలిపారు.

**కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్‌కు విద్యార్థుల వినతి..**

బెజ్జూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోటని అధ్యాపకుడిని నియమించాలని కోరుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంచార్జీ ప్రిన్సిపాల్ సపన్ కుమార్ మండల్‌కు వినతి పత్రం అందజేశారు.



# ఈ నెల 23న ఇన్నోవేషన్ పంచాయత్

**తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ సి.ఈ.ఓ. మెరాజ్ ఫహీం**

**మంచిర్యాల, జనవరి 20 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలు, అంకురాలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్న తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ ఈ నెల 23న కరీంనగర్‌లో ఇన్నోవేషన్ పంచాయతీ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ సి.ఈ.ఓ. మెరాజ్ ఫహీం ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, ఆవిష్కర్తలు, వ్యవస్థాపకులను ఉద్దేశించి ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు కరీంనగర్ పట్టణంలోని ఐ.టి. టవర్‌లో నిర్వహించడం జరుగుతుందని, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల, మంచిర్యాల, భూపాలపల్లి, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల నుండి ఆవిష్కర్తలను, వ్యవస్థాపకులను ఈ కార్యక్రమం ద్వారా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. ఆవిష్కర్తలకు, వారికి అవసరమైన తోడ్పాటుకు మధ్య ఉన్న భౌగోళిక దూరాన్ని తగ్గించడానికి ఈ వేదిక రూపొందించడం జరిగిందని, తమ ఆలోచన, ఆవిష్కరణ / పారిశ్రామిక ప్రయాణం గురించి సందేహాలు ఉన్న ఏ వ్యక్తికైనా, రాష్ట్రంలోని వ్యవస్థాపక నిపుణుల నుండి వ్యక్తిగత, మార్గదర్శకత్వం, సలహాలు పొందేందుకు ఇది ఒక గొప్ప అవకాశం అని తెలిపారు. రాష్ట్ర రాజధాని వెలుపల ఉన్న వ్యవస్థాపకులు, ఆవిష్కర్తలకు వనరులు సమానంగా అందుబాటులో ఉండేలా, తక్షణ, స్పష్టమైన సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. నిపుణులతో నేరుగా చర్చించి, వ్యాపారం, సాంకేతిక సవాళ్లను అక్కడికక్కడే పరిష్కరించడానికి మార్గదర్శకత్వం, ఆలోచన ధ్రువీకరణ, నమూనా అభివృద్ధి, వ్యాపారాన్ని విస్తరించే ప్రక్రియపై సలహాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, ఇంక్యుబేషన్ సహాయాన్ని నేరుగా పొందడానికి కనెక్షన్లను సులభతరం చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆవిష్కర్తలు, ఔత్సాహిక వ్యవస్థాపకులు కార్యక్రమంలో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

### కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత




**ఆసిఫాబాద్, జనవరి 20 (ప్రభాత సమాచారం)** జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచాలని కలెక్టర్ హరిత అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్ రావులతో కలిసి మంగళవారం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ నిధుల కింద మంజూరైన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, అర్హులైన వారికి అందేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. మారు మూల గ్రామాలలో రవాణా సదుపాయాలు మెరుగు పడే విధంగా రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని చెప్పారు. మెరుగైన వైద్య సేవలు అందే విధంగా వైద్య సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు పని దినాలు కల్పించాలని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలు 100 శాతం అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వచ్చే వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల కోసం విద్యార్థులను సన్నద్ధం చేయాలని చెప్పారు. వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు భద్రత నియమాలపై అవగాహన ఉండాలి

**కుభీర్, జనవరి 20 (ప్రభాత సమాచారం)** రోడ్డు భద్రత నియమాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని కుభీర్ ఎస్ఐ కృష్ణ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణ రెడ్డి మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపి ప్రమాదానికి గురై ప్రాణాలు పోగొట్టుకోవద్దన్నారు. మైనర్లు వాహనలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనదారులు ఇన్సరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబందించిన పత్రాలు దగ్గర ఉండేలా చూడన్నారు. ప్రమాదం జరిగిన తరవాత బాధపడే కన్నా ప్రమాదం భారిన పడకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు.

## నేడు బైంసా పట్టణంలో ప్రజావాణి కార్యక్రమం

**ముథోల్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**



బైంసా పట్టణంలో బుధవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ జానకి షర్మిల మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు భైంసా క్యాంప్ ఆఫీస్‌లో నేరుగా ఎస్పీకి అర్జీలు, ఫిర్యాదులు సమర్పించవచ్చని ఆమె పేర్కొన్నారు. బైంసా సబ్ డివిజనల్ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

### గత పాలకుల నిర్లక్ష్యంతోనే

# సాగు నీటి రంగానికి అన్యాయం

### ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



**ముథోల్, జనవరి 20 (ప్రభాత సమాచారం)** గత పాలకులు, ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే పది సంవత్సరాల్లో సాగునీటి రంగానికి అన్యాయం జరిగిందని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. బాసర మండలంలోని బిద్రెల్లి చెరు వుకు రూ.కోటి18 లక్షల రూపాయలతో మరమ్మత్తు పనులు, వాస్తాపూర్ చెరువుకు రూ.11 లక్షల రూపాయలు శెట్టిపల్లి చెరువుకు 70 లక్షల రూపాయలతో మంగళవారం పనులు ప్రారంభించి మాట్లాడారు. సాగునీటి శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో 10 సంవత్సరాల పాలనలో పాలకులు చేయని విధంగా 12 కోట్ల రూపాయల నిధులతో సిరాలా ప్రాజెక్టుకు 100 కోట్ల రూపాయల నిధులతో 35 నుంచి 40 చెరువుల మరమ్మత్తు పనులు ఇప్పటివరకు పూర్తి చేయడం జరిగిందన్నారు. సాగునీటి రంగం మరుగున పడడానికి కారణం గత పాలకులేనని చెప్పారు. అదే విధంగా ప్రస్తుతం రాజురా చెరువు మరమ్మతులకు 49 లక్షల రూపాయలు, ఓని చెరువుకు ఒక్క కోటి 53 లక్షల రూపాయలు, దౌనెల్లి చెరువుకు రూ.35 లక్షల, అందాకూర్ పెద్ద చెరువుకు రూ.35 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందని త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు.



## బీజేపీ నాయకుల సంబురాలు

**నిర్మల్, జనవరి 20 (ప్రభాత సమాచారం)** బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవ ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొని నితిన్ నబీన్ జాతీయ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చ అధ్యక్షులు లక్ష్మీ నర్సయ్య, జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, నాయకులు రావుల రాంనాథ్, ముత్యం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి కరిపే విలాస్‌తో పాటు పట్టణ, మండల బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

**నిర్మల్, జనవరి 20 (ప్రభాత సమాచారం)** రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు నిర్మల్ జిల్లాలో జూనియర్ కళాశాలలో నేటి నుంచి ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఇంటర్మీడియట్ అధికారి పరశురాం నాయక్ తెలిపారు. ప్రథమ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 21, 22, 23, 24 తేదీల్లో ఇంగ్లీష్ ప్రాక్టికల్ పద్ధతితో పాటు ఇతర పరీక్షలు ఉంటాయని తెలిపారు ఈ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ఆయా కళాశాలలో ఈ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కళాశాల ప్రిన్సిపల్ లకు ఆదేశించినట్లు వివరించారు రాబోయే ఇంటర్ పరీక్షలకు మంచి ఫలితాలు సాధించే విధంగా ఇప్పటినుండి అన్ని కళాశాలలు దృష్టి పెట్టాలన్నారు.


# ఘనంగా వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం



**జన్నారం, జనవరి 20 (ప్రభాత సమాచారం)** ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని మేదరి వాడలో ఉన్న శ్రీ మహలక్ష్మీ దేవాలయంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవ సందర్భంగా వేద పండితులు గుండి గణేష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జక్కు భూమేష్ మాట్లాడుతూ .. వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం అంటే, అహింస, సామాజిక న్యాయం కోసం వాసవి కన్యకా పరమేశ్వరి అగ్నిలో ప్రవేశించి తన భౌతిక దేహాన్ని త్యజించి, భగవంతునిలో ఐక్యమైన రోజును ఆర్యవైశ్యులు, భక్తులు ఘనంగా జరుపుకుంటారని అన్నారు. ఆ అమ్మవారి ఆశీస్సులు అందరి మీద ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్, ఆర్యవైశ్య ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మల్యాల కిరణ్, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకుడు, ఆలయ కమిటీ చైర్మన్ జక్కు సత్తయ్య,పుత్తూరి ప్రభాకర్, నారాయణ, లచ్చన్న పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ప్రజాప్రతినిధులు

**ఆసిఫాబాద్, జనవరి 20 (ప్రభాత సమాచారం)** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరితకు ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మార్కెట్ చైర్మన్ జైనూర్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చరణ్ దీపక్, సర్పంచ్ టేకం, నాయకులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

### రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని





**ఆదిలాబాద్, జనవరి 20 (ప్రభాత సమాచారం)** మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని రకాలుగా సన్నద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం కమిషనరు, మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాలలో తగు ఏర్పాట్లను చేయాలన్నారు. ఆర్వో, నోడల్ అధికారులు, మాస్టర్ ట్రైనర్ల శిక్షణ గురించి చర్చించారు. తదితర బృందాల ఏర్పాటుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పురపాలక పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో అవసరమైన మౌళిక సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు ఎంత మంది సిబ్బంది అవసరం అవుతారో అంచనా వేసుకొని, తదనుగుణంగా సిబ్బందిని నియమించుకోవాలన్నారు. బ్యాలెట్ పేపర్ల అవసరాలను బట్టి వాటిని ముద్రించేందుకు ఏజెన్సీలను గుర్తించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, మున్సిపల్ కమిషనర్లు సివియన్ రాజు, నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి



## కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్సులో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

**నిర్మల్, జనవరి 20 (ప్రభాత సమాచారం)** మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని రకాలుగా సన్నద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం కమిషనరు, మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాలలో తగు ఏర్పాట్లను చేయాలన్నారు. ఆర్వో, నోడల్ అధికారులు, మాస్టర్ ట్రైనర్ల శిక్షణ గురించి చర్చించారు. తదితర బృందాల ఏర్పాటుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ విసి అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీల వారిగా పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో అవసరమగు మౌళిక సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు ఎంత మంది సిబ్బంది అవసరం అవుతారో అంచనా వేసుకొని, తదనుగుణంగా సిబ్బందిని నియమించుకోవాలన్నారు. బ్యాలెట్ పేపర్ల అవసరాలను బట్టి వాటిని ముద్రించేందుకు ఏజెన్సీలు గుర్తించాలని తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి జిల్లా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డీఈవో భోజన్న, సిపిఓ జీవరత్నం, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, సుందర్ సింగ్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## 14వ వార్డులో కుక్కల బీభత్సం

**లక్షెట్టిపేట, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో కుక్కలు బీభత్సం సృష్టిస్తున్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారు స్థానిక మున్సిపల్ అధికారులను కలిసి సమస్యను తెలిపారు. ఉదయం కుక్కలు దాడి చేయడంతో నలుగురు గాయపడ్డారని అందులో ఇద్దరు విద్యార్థులు కూడా ఉన్నారన్నారు. వార్డులో కుక్కల బెడదను అరికట్టాలని కోరారు.

## ఆదిలాబాద్‌లో 6 నెలల అమల్లో ట్రాఫిక్ నిబంధనలు

**ఆదిలాబాద్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ అండర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులు ప్రారంభమైన సందర్భంగా ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా వ్యాపారస్థులు సహకరించాలని ట్రాఫిక్ సీఐ ప్రణయ్ కుమార్ అన్నారు. ఈ విషయమై ఛాంబర్ ఆఫ్ కామర్స్, ట్రేడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దినేశ్ మాటోలియాతో పాటు వ్యాపారస్థులతో సమావేశం నిర్వహించారు.తమ లోడింగ్, అన్ లోడింగ్లను ఉదయం 8 లోపు, రాత్రి 8 తరువాతనే చేసుకోవాలన్నారు.

## ఫౌండేషన్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

**మంచిర్యాల, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే 5 నెలల ఫౌండేషన్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంచిర్యాల జిల్లా షెడ్యూల్డ్ కులాల ఉపసంచాలకులు దుర్గప్రసాద్ తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఈనెల 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 8న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

## 27 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**దండేపల్లి, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
దండేపల్లి మండలంలోని శ్రీ గూడెం గుట్ట దేవాలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని ఈవో శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. దేవాలయంలో జనవరి 27న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, 30న స్వామి వారి కళ్యాణం, మార్చి 1 మహా జాతర ఉంటుందన్నారు. కార్యక్రమాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు.



## రిపబ్లిక్ వేడుకలను ఘనంగా నిర్వహించాలి



**ఆసిఫాబాద్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లాలో ఈ నెల 26న రిపబ్లిక్ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ హరిత అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, సబ్‌కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్ రావులతో కలిసి వేడుకల ఏర్పాట్లపై జిల్లా అదికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిపబ్లిక్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. వేడుకల నిర్వహణకు పర్యవేక్షకులుగా అదనపు కలెక్టర్ వ్యవహరిస్తారని చెప్పారు. ప్రోటోకాల్, ప్రముఖులు, వేదిక, పోడియం నిర్వహణ ఆర్డీవో, స్థానిక తహసీల్దార్ వ్యవహరిస్తారని తెలిపారు. వేదిక, పోడియం అంకరణ జిల్లా ఉద్యానవన అధికారి పర్యవేక్షించాలన్నారు. మినిట్ టూ మినిట్ కార్యక్రమాలన్ని జిల్లా ఎస్‌పీ పర్యవేక్షిస్తారని తెలిపారు. అతిథులకు కుర్చీలు, తాగు నీరు, స్నాక్స్ అందించాలని, వీడియోగ్రఫీ, ప్రెస్ గ్యాలరీని జిల్లా పౌర సంబంధాల అదికారి పర్యవేక్షించాలని తెలిపారు. ప్రసంగ ప్రతి రూపొందిం చేందుకు పట్టణ ప్రణాళికాధికారి, జిల్లా పౌరసంబంధిల అధికారి సమన్వయం చేసుకోవాలన్నారు. వేడుకలలో పారిశుధ్య పనులు, నిరంతర విద్యుత్ సరఫరా పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగుల జాబితాను ఈ నెల 24వ తేదీన కలెక్టరేట్ పీవోకు అందించాలన్నారు. వేడుకలలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పనులపై స్టాల్స్ ప్రదర్శించాలన్నారు. విద్యార్థులచేత దేశభక్తి గీతాలపై సాంస్కృతిక ప్రదర్శణ ఉండేలా చూడాలని సూచించారు. జిల్లాలో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.



## ప్రభుత్వ గురుకులాలు పేద విద్యార్థులకు వరం

**ఆసిఫాబాద్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
పేద విద్యార్థులకు ప్రభుత్వ గురుకులాలు వరంలాంటివని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్ , సబ్ కలెక్టర్ లోకేశ్వర్ రావు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి నదీమలతో కలిసి తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యూకేషన్ ఇన్సిట్యూషన్ సోసైటీ ద్వారా మైనార్టీ గురుకులాల ప్రవేశాల గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు గురుకులాల ద్వారా ఉచిత విద్యతో పాటు వసతి సౌకర్యం కల్పించబడుతుందని తెలిపారు. గురకులాల్లో అభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నామన్నారు. 6,7,8 తరగతులలో మైనార్టీ విద్యార్థులకు ఖాళీలు ఉన్న చోట ప్రవేశాలు కల్పించనున్నామన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ప్రాణం తీసిన ప్రేమ వ్యవహారం

### బాలిక మృతి.. చావుబతుకుల్లో యువకుడు

**బేల, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
ప్రేమ వ్యవహారం.. ఒక బాలిక మృతికి కారణం కాగా.. యువకుడు చావుబతుకుల్లో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. మండలంలోని బాలిక(16) జైనథ్ మండలంలోని ఆకుర్ల గ్రామానికి చెందిన యువకుడు (20) కొన్నాళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ నెల 16న బాలిక ఆ యువకుడితో ఉండటాన్ని బాలిక తండ్రి గమనించాడు. కుమార్తెను నిలదీయగా ఆ యువకుడిని ప్రేమిస్తున్నట్లు చెప్పింది. చిన్న వయసులో ప్రేమ వ్యవహారం మంచిది కాదని.. బాగా చదువుకోవాలని సూచించాడు. అయితే సోమవారం ఆ బాలిక ఇంటి వద్ద పురుగు మందు తాగి తండ్రికి చెప్పింది. దీంతో ఆమెను హుటాహుటిన రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సెల్‌ఫోన్ ద్వారా విషయం తెలుసుకున్న ఆ యువకుడు సైతం ఆదిలాబాద్ పట్టణంలోని సూపర్ మార్కెట్ సందులో పురుగు మందు తాగాడు. గమనించిన స్థానికులు రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం పరిస్థితి విషమంగా ఉంది. బాలిక మృతి కేసును నమోదు చేసినట్లు బేల ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. యువకుడి ఆత్మహత్యాయత్నంపై ఫిర్యాదు అందలేదని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ బి.సునీల్ కుమార్ తెలిపారు.

## పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**తలమడుగు, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో టిడిసి-నిక్రా కార్యక్రమం కింద తలమడుగు మండల పశు సంవర్ధక శాఖ సహకారంతో మండలంలోని లచ్చంపూర్‌లో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పశువులకు అవసరమైన మందులు, టీకాలు, ఖనిజ లవణాల మిశ్రమం, మినరల్ లిక్ బ్రిక్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్బంగా కృషి విజ్ఞాన కేంద్రం కోర్డినేటర్ డాక్టర్ రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ.... పశువుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు పాల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ పశు వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. పశువుల ఆరోగ్య సంరక్షణ ద్వారా రైతుల ఆదాయం పెంపొందించడంలో ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగకర మని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంగు, శాస్త్రవేత్తలు డా. రఘువీర్, డా.శివచరణ్, డా.సురేష్, డా. రాకేష్, మండల పశు వైద్యాధికారిణి లావణ్య, సాయి ప్రసాద్, పశు వైద్య సిబ్బంది సౌమ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.






## మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు
# పూర్తి ఏర్పాట్లతో సిద్దంగా ఉండాలి

■ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి ■ వీడియోకాన్ఫరెన్సులో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

**ఆసిఫాబాద్, జనవరి 20 (ప్రభాత సమాచారం)** మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్దంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల కమీషన్ కార్యాలయం నుంచి మున్సిపల్ శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవితో కలిసి మంగళవారం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, మున్సిపల్ కమిషనర్లతో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఎన్నికలలో వినియోగించే సామగ్రి, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ ప్రింటింగ్‌కు అవసరమైన ఏరాపట్లు, నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఏర్పాటు చేయాలని తెలిపారు. రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ, నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, ప్లయింగ్, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందాలు, పీవో, ఓపీవోలకు శిక్షణ కల్పించాలని చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్, సామాగ్రి పంపిణీ కేంద్రం, స్వీకరణ కేంద్రం, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూంలలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికలకు అవసరమైన బడ్జెట్ సిద్ధం చేసుకోవాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరిత, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్ రావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో 20 వార్డులకు గాను 28 పోలింగ్ కేంద్రాలు, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 30 వార్డులకు గాను 85 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. వెబ్‌కాస్టింగ్, నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, పీవోలు, ఓపీవోల నియామకం, శిక్షణ, ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్‌లు గజానన్, రాజేందర్, పట్టణ ప్రణాళికాధికారి యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.





## ముగ్గుల పోటీ విజేతలకు
# బహుమతుల ప్రదానం

**ఆసిఫాబాద్, జనవరి 20 (ప్రభాత సమాచారం)** మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు, చిన్నారులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మంగళవారం ఆసిఫాబాద్ పట్టణంలోని స్థానిక వాసవి కన్యక పరమేశ్వరి ఆలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్బంగా వాసవి క్లబ్ అధ్యక్షుడు మర్యాల ఉదయ బాబు మాట్లాడుతూ ముగ్గుల పోటీలో 31 మంది పాల్గొన్నారన్నారు. పండగ సంస్కృతి, రంగులు, డిజైన్ వంటి అంశాలను పరిగణలోకి తీసుకోని ముగ్గురు న్యాయ నిర్ణేతలు విజేతలను ఎంపిక చేసినట్లు తెలిపారు. సీనియర్ విభాగంలో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులతో పాటు జూనియర్ విభాగంలో సైతం తొలి మూడు స్థానాలకు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శ్రీధర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు రావుల శంకర్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిలివేరి వెంకటేశ్వర్లు, రావుల వెంకన్న, న్యాయ నిర్ణేతలు సాయిని శ్రీదేవి, జ్యోతి, స్వప్న పాల్గొన్నారు.

# గిరిజనుల సంస్కృతికి నిదర్శనం నాగోబా జాతర

## బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్జి జాన్సన్ నాయక్



**ఇంద్రవెల్లి, జనవరి 20 (ప్రభాత సమాచారం)** నాగోబా జాతర... గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు.. ప్రకృతికి... నిదర్శనమని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి నాగోబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం ఆనందరావు, మెస్రం వంశ పెద్దలు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ... నాగోబా ఆశీస్సులు ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్ర ప్రజలపై ఉండాలని దేవుడిని కోరుకున్నానని గుర్తు చేశారు. మరో రెండేళ్ల తర్వాత ఎన్నికలలో బీఆర్ఎస్ అధికారంలోకి తేవాలని దేవుడిని కోరుకున్నానని అన్నారు.. ఆయనతో పాటు మాజీ ఎంపీపీ పంద్రా జయవంతరావు, పిఎసిఎస్ మాజీ చైర్మన్ మారుతి డోంగ్రే, మాజీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఎస్ఈ రఘునాథం అంత్యక్రియలకు హాజరైన జస్టిస్ శ్రీదేవి



**నిర్మల్, జనవరి 20 (ప్రభాత సమాచారం)** రిటైర్డ్ నీటి పారుదల శాఖ సూపర్టెండెంట్ ఇంజనీర్ రఘునాథం అంత్య క్రియల్లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీదేవి పాల్గొన్నారు. రఘునాథం కుటుంబంతో జస్టిస్ శ్రీదేవి కుటుంబానికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. సోమవారం మృతి చెందిన రఘునాథం అంత్యక్రియలు మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రం భాగ్యనగర్ కాలనీలో నిర్వహించారు. మృతి చెందిన సమాచారం తెలుసుకున్న జస్టిస్ శ్రీదేవి, ఆమె భర్త నిర్మల్ కాంగ్రెస్ ఇంచార్జి శ్రీహరి రావుతో కలిసి హైదరాబాదు నుంచి వచ్చి అంత్యక్రియలకు హాజరయ్యారు. మార్కెట్ చైర్మన్ భీమ్ రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ రాజేందర్ తదితరులు హాజరై కుటుంబ సభ్యులను ఓదార్చారు.




## గణతంత్ర దినోత్సవ వేడుకలను
# విజయవంతంగా నిర్వహించాలి

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, జనవరి 20 (ప్రభాత సమాచారం)** గణతంత్ర దినోత్సవ వేడుకలు విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శాఖల వారిగా చేపట్టవలసిన పనులను అధికారులకు వివరించారు. పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ను ఏర్పాటు చేయాలని తెలిపారు. దేశభక్తిని ప్రతిబింబించేలా విద్యార్థులచే వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రముఖులను గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానించాలన్నారు. పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమం జరుగుతున్నంతసేపు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సభా వేదిక సమీపంలో అంబులెన్స్, అత్యవసర మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులకు, అధికారులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.



# కార్పొరేషన్ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

## బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి



**మంచిర్యాల, జనవరి 20 (ప్రభాత సమాచారం)** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, బీజేపీ ద్వారానే కార్పొరేషన్ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. నస్పూర్ పట్టణం ఊరు శ్రీరాంపూర్ కార్పొరేషన్ 31వ డివిజన్ లో నాయకుడు తిప్పని భీమయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు బీజేపీలో చేరినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా రఘునాథ్ వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రఘునాథ్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నిక ల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్పొరేషన్ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులుగా జుల ముఖేష్ గౌడ్, సత్రం రమేష్ , పొన్నవేని సదయ్య, ఈర్ల సదానందం, బద్రి శ్రీకాంత్, కిశోర్, కటుకూరి తిరుపతి, మహేష్ పాల్గొన్నారు.

# 48 గంటలు.. 1000 కిలోమీటర్లు..!



- రెండు రోజుల్లోనే వెయ్యి కిలోమీటర్ల మేర మంత్రి జూపల్లి కృష్ణారావు సుదీర్ఘ ప్రయాణం
- ఒకే రోజులో ఉమ్మడి ఆదిలాబాద్‌లోని నాలుగు జిల్లాలో మంత్రి జూపల్లి సుడిగాలి పర్యటన
- ప్రారంభోత్సవాలు.. పార్టీ శ్రేణులతో సమీక్షలు..
- అర్ధరాత్రి ఒంటి గంటకు నిర్మల్ కలెక్టరేట్‌లో బస
- విశ్రాంతి లేకుండా 'మారథాన్' పర్యటనతో పాలనలో తనదైన ముద్ర.. సరి కొత్త రికార్డ్
- నేటి నుంచి మళ్లీ 3 రోజుల పాటు జిల్లాలోనే..






**నిర్మల్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
రాజకీయాల్లో కొందరి శైలి ప్రత్యేకంగా ఉంటుంది.. మరి కొందరి వేగం విలక్షణంగా ఉంటుంది. కానీ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.. ఈ రెండింటినీ మేళవించి తనదైన వినూత్న రీతిని ఆవిష్కరించారు. పాలనలో ఎప్పుడూ వినూత్న రీతిని అనుసరిస్తూ, తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకునే మంత్రి జూపల్లి కృష్ణారావు అలుపెరగని బాటసారిలా సాగించిన సుదీర్ఘ పర్యటన ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కేవలం 48 గంటల కాల వ్యవధిలో వెయ్యి కిలోమీటర్ల మేర సాగిన ఈ పయనం, క్షేత్రస్థాయిలో ఆయన పనితీరుకు ఉన్న నిబద్ధతను, 'మంత్రి మార్కు' వేగాన్ని చాటిచెప్పింది.

**వెయ్యి కిలోమీటర్ల ప్రయాణం..**
ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి ప్రారంభమైన మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రయాణం అడవి బిడ్డల ఆరాధ్య దైవం మేడారం సమ్మక్క-సారలమ్మ గడప వరకు సాగింది. అక్కడ జరిగిన మంత్రివర్గ సమావేశంలో పాల్గొన్న ఆయన, సోమవారం వేకువజామునే వనదేవతల ఆశీస్సులు పొంది, అటు నుంచి అటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు పయనించారు. ఒక సుడిగాలిలా సాగిన ఈ పర్యటనలో భాగంగా మంచిర్యాల జిల్లా చెన్నూరుకు చేరుకున్న ఆయన.. మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కేవలం ప్రారంభోత్సవాలకే పరిమితం కాకుండా, సర్పంచుల పరిచయ కార్యక్రమంతో పాటు రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ వారిలో నూతనోత్సాహాన్ని నింపారు. అక్కడి నుంచి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ కాగజ్‌నగర్, వాంకిడి, ఆసిఫాబాద్ ప్రాంతాల మీదుగా సాగిన ఆయన ప్రయాణం రికార్డు స్థాయి వేగంతో కొనసాగింది. వరుస అభివృద్ధి పనులు, శంకుస్థాపనలతో జిల్లా యంత్రాంగాన్ని ఉరుకులు పెట్టించిన ఆయన అటు నుంచి అటే ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్ చేరుకుని నాగోబా దేవాలయంలో పూజలు ముగించుకుని, రాత్రి11 గంటల సమయంలో నిర్మల్ ఉత్సవాల వేదికపైకి చేరుకున్నారు. అర్ధరాత్రి వేళ కూడా ప్రజాసక్షంలో ఉత్సాహంగా గడిపిన ఆయన, అర్ధరాత్రి ఒంటి గంటకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ (ఐడీఓసీ) కార్యాలయంలో బస చేశారు. ఇలా తెలంగాణ రాష్ట్రంలో ఐడీఓసీ కార్యాలయంలో రెండు సార్లు బస చేసి రికార్డు సృష్టించారు మంత్రి జూపల్లి. కేవలం 48 గంటల కాలం.. ఉమ్మడి ఖమ్మం జిల్లా మినహా ఉత్తర తెలంగాణలో వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ ప్రయాణం.. మధ్యలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 4 జిల్లాలను ఒకే రోజు చుట్టివచ్చి.. వెరసి ఒక 'మారథాన్' పర్యటనతో ఆయన రాజకీయ క్షేత్రంలో రికార్డు సృష్టించారు. విశ్రాంతిని సైతం విస్మరించి, ప్రజల కోసం పరుగు తీయడమే తన నైజమని ఈ సుడిగాలి పర్యటన ద్వారా ఆయన మరోసారి నిరూపించారు. మంగళవారం ఉదయం రోడ్డు భద్రతా ఉత్సవాల్లో భాగంగా అరైవ్ అలైవ్" పేరిట నిర్వహించిన ప్రచారం కార్యక్రమంలో ఎస్పీ జానకీ షర్మిల, అధికారులతో కలిసి పాల్గొని పతంగులను ఎగుర వేశారు. అనంతరం ఉదయం 9 గంటలకే మళ్లీ రోడ్డె క్కి మధ్యాహ్నం 12 గంటల కల్లా రాజధానికి చేరుకున్నారు. ఒకే రోజులో ఉమ్మడి ఆదిలాబాద్‌లోని నాలుగు జిల్లాలను సందర్శించి, అధికారిక బాధ్యతలను నెరవేరుస్తూనే పార్టీ పటిష్టతకు కృషి చేయడం ఆయన 'కార్యదక్షతకు నిదర్శనం. 48 గంటల పర్యటన ఇప్పుడు సర్వత్ర చర్చకు దారి తీస్తున్నది.

# ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాలలో రీ సర్వేకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

## కమిషనర్ లోకేష్ కుమార్



**ఆసిఫాబాద్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాలలో రీ సర్వేకు ఏర్పాట్లు పూర్తి చేయాలని కమిషనర్ లోకేష్ కుమార్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని కార్యాలయం నుండి రెవెన్యూ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు సర్వే ల్యాండ్ అధికారులతో భూభారతి గ్రామాల రీ సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి సిఎల్ఏ కమిషనర్ మాట్లాడుతూ జిల్లాల వారీగా రీ సర్వేకు ఎంపికైన గ్రామాలలో ప్రక్రియ చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. లైసెన్సుడ్ సర్వేయర్లను ఆయా మండలాలకు కేటాయించాలని, 2వ గెజిట్ నోటిఫికేషన్ జారీ అనంతరం పూర్తి శాస్త్రీయ పద్ధతిలో సర్వే చేపట్టాలని, 22ఎ జాబితాను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ హరిత, అదనపు కలెక్టర్ డేవిడ్, సర్వే ల్యాండ్ రికార్డ్ ఎ.డి. విజయ్‌కుమార్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నక్షాలు లేని 37 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందని, మొదటి విడతలు ఈ గ్రామాలలో రీ సర్వేకు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. 2వ గెజిట్ నోటిఫికేషన్ జారీ తర్వాత కార్యక్రమం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని, లైసెన్సుడ్ సర్వేయర్లను మండలాల వారీగా కేటాయించి సమన్వయం చేసుకుంటామని తెలిపారు. 22 ఎ నిషేధిత భూముల జాబితాను సిసిఎల్ఎకు అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.



## బీజేపీలో పలువురి చేరిక

**కాగజ్‌నగర్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో సీనియర్ నాయకులు ముదిగొండ సాంబయ్య, చంద్రకళ ఆధ్వర్యంలో వార్డు నెంబర్-3 నాయకులు భారతీయ జనతా పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే హరీష్ బాబు పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాగజ్‌నగర్ మున్సిపల్ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలి

### రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ అధికారి వెంకటరమణ

**మందమర్రి, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
మందమర్రి ఏరియాలో రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ (కార్పొరేట్) అధికారి సి. హెచ్. వెంకటరమణ పర్యటించారు. మంగళవారం మందమర్రికి వచ్చిన ఆయనకు జీఎం రాధాకృష్ణ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం వెంకటరమణ జీఎం రాధాకృష్ణతో కలిసి గనిని సందర్శించి అధికారులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం మందమర్రి ఏరియా జనరల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కార్పొరేట్ అధికారి వెంకటరమణ మాట్లాడుతూ సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సూచించారు, ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేసినప్పుడే లక్ష్యాలను చేరుకోవడానికి మార్గం సులువవుతుందన్నారు.

## మూడు మున్సిపాలిటీల్లో
# కాషాయ జెండా ఎగురవేస్తాం

### కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి - ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి




**నిర్మల్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ మున్సిపల్ స్థానాలను బిజెపి కైవసం చేసుకుంటుందని బిజెపి నేత మహేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో మున్సిపల్ ఎన్నిక నేపథ్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ప్రజలు ఆశిస్తున్నారని తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు సమష్టిగా కృషి చేసి నిర్మల్ మున్సిపాలిటీపై కాషాయ జెండా ఎగరేసే విధంగా సమాయత్తం కలవాలని సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ సుపరిపాలనను, విప్లవాత్మక నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎక్కడికక్కడ ఎండగట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్నికల ప్రభారి బస్వ లక్ష్మీ నర్సయ్య, జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, జిల్లా మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, నిర్మల్ మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కరిపె విలాస్, కో కన్వీనర్ సీనియర్ నాయకులు మేడిసెమ్మ రాజు, డా మల్లకార్జున రెడ్డి, అయ్యన్న గారి రాజేందర్, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి జిల్లా బీజేవైఎం అధ్యక్షులు ఒడిసెల అర్జున్, అరవింద్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బందికి
# మానసికోల్లాసం అవసరం

### నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల

**నిర్మల్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
రేయింబవళ్లు ఒత్తిడితో కూడిన విధులు నిర్వహించే పోలీసులకు మానసికోల్లాసం ఎంతో అవసరమని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. మంగళవారం, నిర్మల్ జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో నిర్మల్ పోలీస్ టైగర్స్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో నిర్మల్ సబ్ డివిజన్, భైంసా సబ్ డివిజన్, ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌కు చెందిన మూడు పోలీస్ జట్లు పాల్గొన్నాయి. అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా, నిర్మల్ ఏఎస్పీలు రాజేష్ మీనా, సాయి కిరణ్, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



# ఆ రోజే 'సలార్ 2' సర్‌ప్రైజ్ ..

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన సలార్: పార్ట్ 1 - సీస్‌ఫైర్ టాలీవుడ్‌లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న చిత్రం. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ప్రభాస్‌కి కొత్త మాస్ పవర్ రోల్ ఇచ్చి, ప్రేక్షకులను ఆకట్టింది.ఇప్పటివరకు, సలార్ సీక్వెల్ సలార్: పార్ట్ 2 - శౌర్యాంగ పర్వం గురించి చాలా వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా, ఆన్‌లైన్‌లో ఒక రూమర్ వేగంగా వైరల్ అవుతోంది. అది ఏమిటంటే, ఈ సీక్వెల్ కోసం జనవరి 25, 2026లో అనౌన్స్‌మెంట్ టీజర్ విడుదల కాబోతుందని అంటున్నారు. అయితే, హోంబేల్ ఫిల్మ్స్ లేదా మేకర్స్ నుండి ఎలాంటి అధికారిక ప్రకటన లేదు.ప్రస్తుతానికి, దర్శకుడు ప్రశాంత్ నీల్ Jr NTRతో డ్రాగన్ (టెంటేటివ్ టైటిల్) షూట్‌లో బిజీగా ఉన్నారు. మరోవైపు, ప్రభాస్ ఇటీవల 'ది రాజా సాబ్' సినిమాలో కనిపించి ఆకట్టుకున్నారు.సలార్ 2 శౌర్యాంగ పర్వం కోసం జనం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. పార్ట్ 1 చివరి ఎండ్ క్రెడిట్‌లో సీక్వెల్ టైటిల్‌ను సీక్రెట్ గా ప్రకటించారనేది ప్రత్యేకం. ఈ రెండవ భాగం కోసం షూట్ ఇంకా ప్రారంభం కాలేదు, కానీ ప్రీ-రిజీల్ ఇంటర్వ్యూలలో దర్శకుడు మాట్లాడుతూ, ఇది రెండు భాగాల్లో రిలీజ్ చేయాలని ప్రణాళికలో ఉందని చెప్పారు.సీక్వెల్‌లో ప్రభాస్ కర్ణానికి చెందిన దేవ అనే పాత్ర శౌర్యాంగ కులానికి చెందిన వ్యక్తిగా, వరద (పృథ్విరాజ్)కి వ్యతిరేకంగా మారడం, అతని ట్రాన్స్ఫర్మేషన్ ను ఫోకస్ చేసి చూపించనున్నారు. ఈ క్రమంలో కొత్త సీన్‌లు, సరికొత్త స్టోరీ మలుపులు ప్రేక్షకులను ఆకట్టనున్నాయి.ప్రేక్షకులు సలార్ 2 టీజర్ కోసం చాలా ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. జనవరి 25, 2026 టీజర్ రూమర్ నిజం అవుతుందా అన్నదానిపై ఇప్పుడు అందరి దృష్టి పడింది.





# కనకరాజు రాక

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా... ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థతో కలిసి యు.వి. క్రియేషన్స్ ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. రితికా నాయక్ కథానాయిక. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్నారు. హారర్ కామెడీ కథకి ఇండియా - కొరియా నేపథ్యాన్ని జోడించి రూపొందిస్తున్న చిత్రమిది. వరుణ్‌తేజ్ పుట్టినరోజును పురస్కరించుకుని సోమవారం ఈ సినిమా పేరు 'కొరియన్ కనకరాజు' అని ప్రకటిస్తూ, ఓ ప్రచార చిత్రాన్ని విడుదల చేసింది చిత్రబృందం. కొరియన్ కనకరాజు పాత్రలో వరుణ్‌తేజ్ 'నేను తిరిగొచ్చా' అంటూ కొరియా భాషలో మాట్లాడుతూ సందడి చేయడం ప్రచార చిత్రానికి ఆకర్షణగా నిలిచింది.

# ఇళయరాజాకు పద్మపాణి పురస్కారం

ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాను పద్మపాణి పురస్కారం వరించింది. ఈ విషయాన్ని అజంతా ఎల్లోరా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్(ఎఐఎఫ్ఎఫ్) నిర్వాహకులు ఇన్‌స్టా వేదికగా వెల్లడించారు. ఈ అవార్డుని ఉత్సవ ప్రారంభోత్సవంలో జాతీయ, అంతర్జాతీయ కళాకారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, సినీ ప్రియుల సమక్షంలో ఆయనకు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు ఇటీవల ఓ ప్రకటనలో తెలిపారు. ఈ చలనచిత్రోత్సవం జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో జరగనుంది. పద్మపాణి జ్ఞాపికతోపాటు ఆయనకు గౌరవ పత్రం, రూ.2లక్షల నగదుని ప్రదానం చేస్తారు. గతంలో ఈ అవార్డును అందుకున్నవారిలో గీత రచయిత జావేద్ అక్తర్, ప్రముఖ దర్శక-రచయిత సాయి పరంజ్‌పే, నటుడు ఓం పురి తదితరులు ఉన్నారు.



# నన్ను తొక్కాలని చూస్తే..

సినిమా ఇండస్ట్రీలో నటీనటులపై జరుగుతున్న నెగెటివ్ పిఆర్, పెయిడ్ ఆన్‌లైన్ క్యాంపెయిన్‌లపై నటి నిధి అగర్వాల్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె, ఒకరిని పైకి తీసుకురావడం కంటే.. డబ్బు ఖర్చు చేసి మరీ ఎదుటివారిని తొక్కేయడానికి ప్రయత్నించడం చాలా దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. బుక్ మై షో రేటింగ్స్, IMDb రివ్యూలను కూడా డబ్బుతో ప్రభావితం చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఇటీవల తనపై కూడా ఒకటి రెండు నెగెటివ్ క్యాంపెయిన్‌లు మొదలయ్యాయని, అయితే తాను వాటిని వెంటనే అడ్డుకున్నానని ఆమె వెల్లడించారు. "నేను నా పనితో పైకి ఎదుగుతా, కానీ నన్ను కావాలని దెబ్బతీయాలని చూస్తే ఊరుకోను" అంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. నటీనటులు చాలా సున్నిత మనస్కులని, ఇటువంటి దాడులు వారి మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని నిధి ఆందోళన వ్యక్తం చేశారు. వరుణ్ ధావన్, కార్తీక్ ఆర్యన్ వంటి నటులపై జరిగిన నెగెటివ్ పిఆర్ దాడులను ప్రస్తావిస్తూ.. ఇలాంటివి చేయడం సరైన పద్ధతి కాదన్నారు. "సెలబ్రిటీలు అంటే పబ్లిక్ ప్రాపర్టీ కాదు, వారికి కూడా ఇంట్లో తల్లిదండ్రులు ఉంటారు. వారికి మేము సమాధానం చెప్పుకోవాలి" అని ఆమె స్పష్టం చేశారు. ప్రతిభను ప్రోత్సహించడం మాని, ఇలా ఒకరిని కిందకు లాగడానికి ప్రయత్నించడం సరైనది కాదని ఆమె అభిప్రాయపడ్డారు.



# 'జన నాయగన్' సెన్సార్ గండం దాటుతుందా?

తమిళ సూపర్ స్టార్ ఇళయ దళపతి విజయ్ కెరీర్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మకమైన చిత్రం "జన నాయగన్". హెచ్ వినోద్ దర్శకత్వంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం సెన్సార్ విషయంలో చట్టపరమైన చిక్కుల్లో పడిన విషయం తెలిసిందే. వాస్తవానికి ఈ సినిమా సంక్రాంతి కానుకగా విడుదల కావాల్సి ఉన్నా కొన్ని సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది. అయితే, తాజాగా ఈ సినిమా సెన్సార్ విషయమై వివాదం తలెత్తి కోర్టు వరకు వెళ్లింది. దీనిపై నేడు చెన్నై హైకోర్టులో కీలక విచారణ జరగనుండటంతో కోలీవుడ్ మొత్తం ఈ తీర్పు కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తోంది. ఇక ఈ రోజు వెలువడే తుది తీర్పు సినిమా భవితవ్యాన్ని, అలాగే తదుపరి విడుదల తేదీని నిర్ణయించనుంది.ఈ భారీ ప్రాజెక్ట్‌ను కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తుండగా, యువ సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. విజయ్ రాజకీయాల్లోకి వెళ్లే ముందు చేస్తున్న చివరి సినిమా కావడంతో దీనిపై తమిళనాట విపరీతమైన క్రేజ్ ఉంది. సెన్సార్ బోర్డు అభ్యంతరాల నేపథ్యంలో చిత్ర యూనిట్ కోర్టును ఆశ్రయించింది. ఒకవేళ కోర్టు నుంచి సానుకూల తీర్పు వస్తే, త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటించే అవకాశం ఉంది. లేనిపక్షంలో సినిమా మరింత ఆలస్యం అయ్యే ప్రమాదం కనిపిస్తోంది. దీంతో విజయ్ అభిమానులు మాత్రం సోషల్ మీడియా వేదికగా ఈ సమస్య త్వరగా పరిష్కారం కావాలని, తమ నటుడిని వెండితెరపై చూసేందుకు ఆతృతగా ఉన్నామని పోస్టులు పెడుతున్నారు. నేడు వెలువడే కోర్టు తీర్పుపైనే ఈ 'జన నాయగన్' అదృష్టం ఆధారపడి ఉంది.







# ఉత్సవం ఉరిమే ఉత్సాహం

- రెండో రోజు అట్టహాసంగా నిర్మల్ ఉత్సవాలు
- ఉత్సవాలలో పాల్గొన్న కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**

మంగళవారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రెండవ రోజు నిర్మల్ ఉత్సవాల కార్యక్రమం అట్టహాసంగా కొనసాగింది. ఉదయం నుంచి భారీ సంఖ్యలో నిర్మల్ పట్టణంతోపాటు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన సందర్శకులు పాల్గొన్నారు. స్టాల్స్ సందర్శించి, ఉత్సవాల వినోదాన్ని అనుభూతి చెందారు. చిన్నారులు కేరింతలు కొడుతూ ఉత్సాహంతో ఆటలు ఆడుకున్నారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు, సందర్శకులతో ఎన్టీఆర్ మినీ స్టేడియం కిక్కిరిసిపోయింది. మంగళవారం రాత్రి ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. నిర్మల్ ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ సంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. సెల్ఫీ పాయింట్ వద్ద చిన్నారులతో ఫోటోలు దిగారు. మిగిలిన మూడు రోజుల పాటు మరింత ఉత్సాహభరితంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న పలువురికి కలెక్టర్ ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. నిర్మల్ ఉత్సవాలలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.















# వన్యప్రాణుల గణన షురూ

**జన్నారం, జనవరి 20 (ప్రభాత సమాచారం)**

అఖిల భారత పులుల గణన-2026లో భాగంగా మంగళవారం జన్నారం అటవీ డివిజన్‌లో వన్యప్రాణుల గణన ప్రారంభించారు. డివిజన్‌లోని అన్ని బీట్‌లో కేటాయించిన సిబ్బంది ఉదయం ఆరు గంటలకే అడవులకు చేరుకున్నారు. సరళ రేఖ ప్రకారం వన్యప్రాణుల గణన చేశారు. జన్నారం, ఇం దనపల్లి, తాళ్లపేట రేంజ్ల రేంజ్ అధికారులు లక్ష్మినారాయణ, సుష్మారావు, లక్ష్మి నారాయణ సిబ్బందితో కలిసి గణనలో పాల్గొన్నారు. ఉదయం నాలుగు, సాయంత్రం నాలుగు కిలోమీటర్ల చొప్పున కాలినడకన ఏర్పాటు చేసిన వరుసల్లో జంతువుల ఆనవాళ్లు సేకరించారు. జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్ మంచిర్యాల రేంజ్‌లో పర్యటించారు. కోటపల్లి మండల కేంద్రంలోని కార్యాలయంలో జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్ వాలం టీర్లు, సిబ్బందితో సమావేశమై జంతు గణనపై సూచనలు చేశారు. ఈ నెల 25వరకు సర్వే కొనసాగుతుందని, అట వీశాఖ అధికారుల సమన్వయంతో వాలంటీర్లు ముందుకు వెళ్లలాని సూచించారు. పులుల జాడలు, పాదముద్రలు, మల విసర్జన, నివాస నాణ్యత తదితర వివరాలు సేకరించాలని తెలిపారు. అడవుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా పులుల సంఖ్యను అంచనా వేస్తారని తెలిపారు. సెక్షన్, బీట్ అధికారు లు పాల్గొన్నారు.



■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

పురపోరుకు నేడో.. రేపో నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండటంతో రాజకీయం రోజురోజుకు వేడెక్కుతోంది. ఎక్కడ చూసినా డివిజన్, వార్డుల రిజర్వేషన్‌లపైనే చర్చ జరుగుతోంది. రిజర్వేషన్‌లలో అవకాశం కోల్పోయిన నాయకులు చాలామంది సైలెంట్అవగా, రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చిన వారు ఇప్పటికే గల్లీల్లో ఇంటింటికి వెళ్లి ఓటర్ల మద్దతు కోరుతున్నారు. రిజర్వ్ స్థానాలలోనే తీవ్ర పోటీ నెలకొంది. టికెట్ తమకే వస్తుందనుకున్న నాయకులు ధీమాతో ప్రచారం మొదలుపెట్టగా, పోటీ ఉన్న చోట మాత్రం ఆయా పార్టీల ముఖ్య నాయకుల అనుగ్రహం కోసం ఆశావహులు తిరుగుతున్నారు. టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీ కార్యాలయాల వద్ద సందడి మొదలైంది. టికెట్ కోసం ముఖ్య నాయకులకకు దగ్గరగా ఉన్న వారితో లాబీయింగ్ చేస్తున్నారు. అనుకూలంగా ఉన్నవారితో మాట్లాడించి టికెట్ వచ్చేలా చేయాలని కోరుతున్నారు. అన్ని డివిజన్‌లలో ఇప్పటికే ప్రచారం షురూ అయింది. కాంగ్రెస్ పార్టీలో మైనారిటీలు ఎక్కువగా టికెట్ ఆశిస్తున్నారు. పార్టీలో ఉన్న ముఖ్య నాయకుల ఆశీస్సుల కోసం ఆశావహులు చేస్తున్న ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు.

# ఆశావహుల పైరవీలు




- ■ టికెట్ల కోసం నాయకుల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణ
- ■ ముఖ్యులకు, దగ్గరగా ఉన్నవారితో మంతనాలు షురూ
- ■ పోటీకి డివిజన్లలో చర్చలు ■ టికెట్ ఖాయమన్న ధీమా ఉన్నవారు ప్రచారం షురూ..
- ■ గెలుపు గుర్రాల కోసం పార్టీల అన్వేషణ ■ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల్లో తీవ్ర పోటీ
- ■ రిజర్వేషన్ అనుకూలించని అభ్యర్థులు ఇతర వార్డుల కోసం అన్వేషణ..
- మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో టికెట్ల కోసం ఆశావహుల ముమ్మర ప్రయత్నాలు
- ■ ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు..
- ■ టికెట్ వస్తుందన్న నమ్మకంతో పలకరింపులతో ఎన్నికల ప్రచారం మొదలు..

పురపోరుకు నేడో.. రేపో నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండటంతో రాజకీయం రోజురోజుకు వేడెక్కుతోంది. ఎక్కడ చూసినా డివిజన్, వార్డుల రిజర్వేషన్‌లపైనే చర్చ జరుగుతోంది. రిజర్వేషన్‌లలో అవకాశం కోల్పోయిన నాయకులు చాలామంది సైలెంట్అవగా, రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చిన వారు ఇప్పటికే గల్లీల్లో ఇంటింటికి వెళ్లి ఓటర్ల మద్దతు కోరుతున్నారు. రిజర్వ్ స్థానాలలోనే తీవ్ర పోటీ నెలకొంది. టికెట్ తమకే వస్తుందనుకున్న నాయకులు ధీమాతో ప్రచారం మొదలుపెట్టగా, పోటీ ఉన్న చోట మాత్రం ఆయా పార్టీల ముఖ్య నాయకుల అనుగ్రహం కోసం ఆశావహులు తిరుగుతున్నారు. టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీ కార్యాలయాల వద్ద సందడి మొదలైంది. టికెట్ కోసం ముఖ్య నాయకులకకు దగ్గరగా ఉన్న వారితో లాబీయింగ్ చేస్తున్నారు. అనుకూలంగా ఉన్న వారితో మాట్లాడించి టికెట్ వచ్చేలా చేయాలని కోరుతున్నారు. అన్ని డివిజన్‌లలో ఇప్పటికే ప్రచారం షురూ అయింది. కాంగ్రెస్ పార్టీలో మైనారిటీలు ఎక్కువగా టికెట్ ఆశిస్తున్నారు. పార్టీలో ఉన్న ముఖ్య నాయకుల ఆశీస్సుల కోసం ఆశావహులు చేస్తున్న ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు. ఇన్నాళ్లు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న నాయకులు కూడా తెరపైకి వచ్చి టికెట్ కోసం పైరవీలు సాగిస్తున్నారు. పోటీ ఎక్కువగా ఉన్న డివిజన్‌లలో అభ్యర్థుల ఎంపిక నాయకులకు తలనొప్పిగా మారుతోంది. పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు కూడా డివిజన్‌ల వారీగా గెలుపు గుర్రాల కోసం అన్వేషిస్తున్నారు. ఆయా డివిజన్ లలో ఉన్న సామాజికవర్గాల బలం, పోటీలో ఉండే అభ్యర్థి సామాజిక వర్గంతోపాటు ఆ వర్గంలో అతనికి ఉన్న ఆదరణను పరిశీలిస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలో ఇప్పటికే సగం డివిజన్‌లకు అభ్యర్థులను ముఖ్య నాయకులు దాదాపుగా ఎంపిక చేసుకోగా, మిగతా సగం డివిజన్ లలో మాత్రం ఒక్కో డివిజన్ నుంచి రెండు, పేర్లు పరిశీలిస్తున్నారు. అందులో ఎవరైతే గెలుస్తారని ద్వితీయ శ్రేణి నాయకులతో సంప్రదింపులు చేస్తున్నారు. పార్టీల నాయకులు కొన్నిచోట్ల డమ్మీలను కూడా బరిలో దించే అవకాశం లేకపోలేదు. అవతలి పార్టీలో తమకు కావలసిన నాయకుడి కోసం తమ పార్టీ నుంచి డమ్మీలను కూడా దించుతున్నారన్న ప్రచారం సాగుతోంది.

మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన వార్డుల వారీగా రిజర్వేషన్లు ఖరారు కావటంతో జిల్లాలో ఆయా పార్టీల్లో రాజకీయ సమీకరణలు తెరపైకి వచ్చాయి. ఈ సారి మున్ని పల్ ఎన్నికల్లో పోటీ పార్టీల మధ్య కంటే పార్టీల లోపలే ఎక్కువగా కన్పిస్తోంది. కాంగ్రెస్, బీఆర్ ఎస్ , బీజేపీ పార్టీల నుంచి టికెట్ల కోసం ఆశావహుల కదలికలు ముమ్మరమయ్యాయి. నాలుగురోజుల క్రితం జిల్లా కేంద్రంలో రెండు మున్సిపాలిటీలకు సంబంధించిన చైర్మన్ , వార్డు సభ్యుల రిజర్వేషన్లు ప్రకటించారు. దీంతోటికెట్టు కోసం ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

**సామాజిక సమీకరణాలే కీలకం..**

రిజర్వేషన్ అనుకూలంచని వారు తమకు అనుకూలంగా ఉన్న ఇతర వార్డుల నుంచి బరిలో ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధిత పార్టీ నాయకులపై ఒత్తిడి తెస్తున్నారు. ఆశావహుల సంఖ్య పెరుగుతుండటంతో పోటీ పెరిగింది. టికెట్లు దక్కించుకునేందుకు ఆశావహులు పార్టీ కార్యాలయాలు, జిల్లా స్థాయి నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు నేతలు ఇప్పటికే తమకు అనుకూలంగా ఉన్న వార్డుల్లో పలుకరింపులు ప్రారంభించి అనధికారికంగా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మరో వైపు రిజర్వేషన్ల నేపథ్యంలో కొన్ని వార్డుల్లో సామాజిక వర్గాలు లెక్కలు కీలకంగా మారాయి. అధికార కాంగ్రెస్ పార్టీ రెండు సంవత్స రాల్లో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను నమ్ము కుంది. బీఆర్ ఎస్ పార్టీ పది సంవత్సరాల కాలంలో తా ము చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్తోంది. బీజేపీ మాత్రం పట్టణ ఓటర్లపై దృష్టి పెట్టి సంస్థాగత బలాన్ని పెంచేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

**యువత, మహిళలకు అవకాశం కల్పించేలా..**

జిల్లాలో రెండు మున్సిపాల్టీలో మహిళలకు 50 శాతం టికెట్లకేటాంచారు. బీఆర్ ఎస్ పార్టీలోని సీనియ ర్ నాయకులకు ఈసారి రిజర్వేషన్ అనుకూలించక పోవటంతో వారు ఇతర వార్డుల్లో అన్వేషణలో పడ్డారు. మరోవైపు యువత, మహిళలు, తొలిసారి రాజకీయాల్లో వస్తున్న వారికి అవకాశాలు కల్పించాలనే యోచనలో బీఆర్ఎస్ పార్టీ ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ సమస్యకు ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే పరిష్కరించాలని నేతలు పేర్కొంటున్నారు. ఆసిఫాబాద్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఉండటం ఇక్కడ బీఆర్ఎస్‌కు ప్లస్ అయ్యే అవకాశాలున్నాయి.

**ముందస్తు మంతనాలు..**

కాంగ్రెస్ పార్టీ సిర్పూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ దండే విఠల్ పూర్తిగా భుజస్కందాలపై వేసుకొని అభ్యర్థుల ఎంపిక చేస్తున్నారు. 30 వార్డుల్లో పక్కాగా గెలుపొందే వారికి ఎంపిక చేస్తున్నారు. రిజర్వేషన్ అనుకూలించిన వారితో ముందస్తుగానే మంతనాలు జరిపి పక్కగా సపోర్టు చేస్తామని స్పష్టంగా హామీ ఇస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సుగుణ టికెట్టు వ్యవహారాలపై వాకాబు చేస్తున్నారు. జిల్లా నుంచి మెజార్టీ స్థానాలు గెలిపించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు.

## రాష్ట్రస్థాయి బొమ్మల విద్య బోధన శిక్షణకు ఎల్లన్న

**కుభీర్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ప్రభుత్వం విద్య నైపుణ్య బోధన పెంపొందించడంలో భాగంగా రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన బొమ్మలు, ఆట వస్తువుల శిక్షణలో నిర్మల్ ఉపాధ్యాయుడికి అవకాశం లభించింది. జిల్లాకు చెందిన ఎల్లన్న రెండు రోజుల శిక్షణ తరగతులు జిల్లా నుంచి ప్రాథమిక వంచి చిన్న పిల్లలకు ఆట బొమ్మల వల్ల విద్యా ప్రమాణాల పెంపుపై ప్రదర్శనను ఇచ్చారు. త్వరలో ఆయన నిర్మల్ జిల్లాలో తోటి ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు.




## ట్రాఫిక్ నిబంధనలపై ప్లకార్డులతో ప్రచారం

**ముథోల్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**

ముథోల్ పోలీస్ స్టేషన్‌లో సిఐ రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ట్రాఫిక్ నిబంధనలపై ప్రచారం నిర్వహించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనల గురించి వాహనదారులకు తెలిసే విధంగా పోలీసులు అరైవ్ అలైవ్, డిఫెన్స్ డ్రైవింగ్, పై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా పోలీసులు, యువకులు, జర్నలిస్టులతో కలిసి ట్రాఫిక్ నిబంధనలపై వీడియో తీయించారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు. ట్రాపిక్ నిబంధనలు పాటించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్సై బిట్ల పెర్సిస్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



# గిరిజనుల అభివృద్ధికి కృషి

## కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత

కెరమెరి, జనవరి 20 (ప్రభాత సమాచారం)

జిల్లాలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేస్తామని కలెక్టర్ హరిత అన్నారు. జిల్లాలో మొదటి మహిళా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన హరిత మంగళవారం కెరమెరి మండలం జోడేఘాట్‌లోని కుమరం భీం సమాధి వద్ద పూజలు నిర్వహించారు. భీం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మ్యూజియంను సందర్శించి మ్యూజియంలో పొందుపరిచిన అలంకరణలు, చిత్రాలు, గిరిజన సంస్కృతికి సంబంధించిన చరిత్రను తిలకించి ఆదివాసీ నాయకులు, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని తెలిపారు. జోడేఘాట్ గ్రామంలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు గ్రామానికి విచ్చేసిన కలెక్టర్‌ను ఆదివాసీలు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## కుమ్రంభం జిల్లా కలెక్టర్‌కు
# శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

ఆసిఫాబాద్, జనవరి 20 (ప్రభాత సమాచారం)

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన హరితను ఎమ్మెల్యే కోవ లక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అలిబిన్ అహ్మద్, సరస్వతి, లక్ష్మి, అహ్మద్, నిస్సార్, అహ్మద్, బలరాం, గంధం శ్రీనివాస్, జావీద్, సాజిద్, తాజ్, శంకర్, రవి, సంజీవ్, సత్తన్న పాల్గొన్నారు.

# ప్రాణాల విలువ తెలుసుకోవాలి

ఖానాపూర్, జనవరి 20 (ప్రభాత సమాచారం)

ప్రాణాల విలువ ప్రతి ఒక్కరు తెలుసుకొని ప్రమాదాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఖానాపూర్ పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణపై నిర్వహించిన అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ప్రజల తప్పిదాల వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.




# నేడు బీఆర్ఎస్‌లో భారీ చేరికలు

## కేటీఆర్ సమక్షంలో అనుచరులతో చేరనున్న రాజిరెడ్డి

చెన్నూర్, జనవరి 20 (ప్రభాత సమాచారం)

బీఆర్ఎస్ పార్టీలో చెన్నూర్ నుంచి భారీ చేరికలకు ముహూర్తం ఖరారైంది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నాయకత్వంలో ఉమ్మడి ఆదిలాబాద్ జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి తన అనుచరులతో కలిసి చేరనున్నారు. మూల రాజిరెడ్డి గత కొద్ది నెలల నుంచి మంత్రి వివేక్ తీరును విమర్శిస్తూ వస్తున్నారు. మూడు రోజుల క్రితమే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. వెయ్యి మంది అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు. ఈ మేరకు సుమారు వందకుపైగా వాహనాల్లో తన అనుచరులతో కలిసి చెన్నూర్ నుంచి హైదరాబాద్‌కు ర్యాలీగా బయల్దేరనున్నారు. అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ పార్టీలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు చేరనున్నందున కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్లు, నాయకులు, పాల్గొనాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లెల దామోదర్ రెడ్డి కోరారు.

# విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతరం ఆరా

## ఐటీడీఏ పల్స్ యాప్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ - పీవో యువరాజ్ మర్మాట్



ఉట్నూర్, జనవరి 20 (ప్రభాత సమాచారం)

ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యంపై ఐటీడీఏ పల్స్ యాప్ ద్వారా నిరంతరం పర్యవేక్షించనున్నట్లు పీవో యువరాజ్ మర్మాట్ పేర్కొన్నారు. స్థానికి కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఆయా జిల్లాల వార్డెన్‌లతో సమావేశమై మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్య వివరాలు పొందుపరిచేలా యాప్ రూపొందించినట్లు తెలిపారు. దీని ద్వారా ప్రధానోపాధ్యాయులు, వసతిగృహాల సంక్షేమాధికారులు, రోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం సంబంధిత వివరాలతో విద్యార్థుల ఫొటోలు అప్లోడ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈయాప్ ఉపయోగించి ఫొటోలు అప్లోడ్ చేస్తున్నట్లు తెలిపారు. యాప్ ద్వారా విద్యార్థులకు అందిస్తున్న ఆహారం వివరాలు నిత్యం పర్యవేక్షించనున్నట్లు పేర్కొన్నారు. తద్వారా విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు తెలుసుకుని అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఏవైనా సమస్యలుంటే యాప్‌లో నమోదు చేస్తే ఎప్పటికప్పుడు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఆహారం నాణ్యత, పరిశుభ్రతను నిర్ధారించడానికి ఫొటోలు అప్లోడ్ చేసిన తర్వాత నిత్యం ప్రాజెక్ట్ అధికారి కార్యాలయం నుంచి స్వయంగా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసు కుంటున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట అడిషనల్ డీఎంహెచ్ మనోహర్ తదితరులున్నారు.

## చట్టాన్ని చేతిలోకి
# తీసుకుంటే కఠిన చర్యలు

నిర్మల్, జనవరి 20 (ప్రభాత సమాచారం)

చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని ఏఎస్పీ సాయి కిరణ్ హెచ్చరించారు. సోమవారం రాత్రి నిర్మల్‌లోని జయశంకర్ చౌరస్తా వద్ద గోవులను అక్రమంగా తరలిస్తున్నారనే ప్రచారం పేరుతో కొందరు వ్యక్తులు కంటైనర్ వాహనాన్ని అడ్డుకున్నారని తెలిపారు. వాస్తవానికి నిబంధనలకు విరుద్ధంగా ఎద్దులను అధికంగా తరలిస్తుండటాన్ని గుర్తించి వాహన యజమానిపై కేసు నమోదు చేసి, ఎద్దులను గోశాలకు తరలించినట్లు చెప్పారు. రోడ్లపై వాహనాలను అడ్డు కోవడం, ట్రాఫిక్కు ఆటంకం కలిగిస్తే చర్యలు ఉంటాయన్నారు.

# ఆర్థిక అక్షరాస్యత అవసరం

సిరికొండ, జనవరి 20 (ప్రభాత సమాచారం)

గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ ఆర్థిక అక్షరాస్యత అవసరమని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వేణుప్రసాద్ అన్నారు. మంగళవారం సిరికొండ మండలం ధర్మసాగర్ గ్రామంలో వీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్‌బీఐ సహకారంతో ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్లు గ్రామీణ స్థాయి ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని, సామాజిక భద్రత ఇన్సూరెన్సులు బ్యాంకుల ద్వారా వినియోగించుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు జరిగితే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దినేశ్, కౌన్సిలర్లు సంతోష్, అరవింద్, ప్రసాద్, బిక్కు నాయక్, మహిళలు పాల్గొన్నారు.

## శిక్షణ తరగతుల్లో పాల్గొన్న
# సిరికొండ ఉపాధ్యాయుడు

సిరికొండ, జనవరి 20 (ప్రభాత సమాచారం)

విద్యా వ్యవస్థలో నూతనంగా ప్రవేశపెట్టిన టాయ్ బేస్డ్ పెడగోజీ (బొమ్మల ఆధారిత బోధన)పై టీజీఐఆర్టీ, రాజేంద్రనగర్ (రంగారెడ్డి జిల్లా)లో రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి ఆదిలాబాద్ జిల్లా తరఫున పీఎం శ్రీ ఎంపీపీఎస్ సిరికొండ పాఠశాల ఉపాధ్యాయుడు (డీఆర్పీ)గా మునేశ్వర్ విజయకుమార్ హాజరయ్యారు. అక్కడ నేర్చుకున్న అంశాలను ఆదిలాబాద్ డైట్ కళాశాల ద్వారా ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని అన్ని పీఎం శ్రీ ప్రాథమిక, ఉపాధ్యాయులకు అందించనున్నట్లు తెలిపారు.

## న్యాయ సేవా కేంద్రాన్ని
# సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్, జనవరి 20 (ప్రభాత సమాచారం)

ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా జాతరలో ఆదిలాబాద్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఉచిత న్యాయ సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉట్నూర్ కోర్టు ప్యానెల్ అడ్వకేట్ జమీరాఖాన్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో కక్షిదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు చింతలగిరి, కుడెల్లి అశోక్, మానాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

కుభీర్, జనవరి 20 (ప్రభాత సమాచారం)

భైంసా పట్టణంలో సోమవారం అర్ధరాత్రి ఆర్టీసీ బస్ డిపో సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నాలుగురు అక్కడికక్కడే మృతి చెందగా ఒక్కరు తీవ్రంగా గాయపడ్డాడు. మరో ఇద్దరు స్వల్ప గాయలతో బయట పడ్డారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నారాయణ్ రావు పటేల్ మంగళవారం కుప్టి, కుభీర్ గ్రామాలకు వెళ్లి బాధిత కుటుంబ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం కుభీర్‌కు చెందిన బొప్ప వికాస్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. చిన్న తనంలో వికాస్ మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఆయనతో పాటు మండల అధ్యక్షులు బషీరు, వివేక్ తదితరులున్నారు.








# నాగోబాకు ప్రణమిల్లి

- అన్ని దారులు నాగోబా వైపే..
- మెస్రం వంశ కొత్త కోడళ్లకు గోవాడలో కిక్రి వాయిస్తూ పాటల రూపంలో బోధనలు
- పూజలందుకుంటున్న నాగోబా
- కేస్లాపూర్‌కు వేలాదిగా తరలివస్తున్న భక్తులు..
- ఆదివాసీ జాతరలు దేశ సమైక్యతకు ప్రతీకలు
- ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో బాసర నుండి భద్రాచలం వరకు దేవాలయాల అభివృద్ధి..
- గ్రామీణాభివృద్ధి, శాఖ మంత్రి సీతక్క
- నాగోబా ఆలయంలో పూజలు చేసిన సీతక్క



**ఇంద్రవెల్లి, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబాను దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా గిరిజనులతో పాటు గిరిజనేతరులు ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా వైపు ప్రయాణమవుతున్నారు. దీంతో నాగోబా జాతర జన సంద్రంగా మారు తోంది. మరోవైపు నాగోబా సన్నిధిలో బేటింగ్ (పరిచయం) అయిన మెస్రం వంశ కొత్త కోడళ్లకు మెస్రం వంశ ప్రధాన్ లు తమ సాంప్రదాయ వాయిద్యం 'కిక్రి' ద్వారా నాగోబా చరిత్ర, విశిష్టతను వినిపించారు. మంగళవారం గోవాడలో నాగోబా సన్నిధిలో బేటింగ్ అయిన కోడళ్లకు నాగోబా దేవుడి పూర్వ చరిత్రను సాంప్రదాయ వాయిద్యం కిక్రినీ వాయిస్తూ పాటలు పాడుతూ నాగోబా చరిత్రను వివరించారు. నాగోబా చరిత్రను వివరించి చెప్పిన ప్రధాన్‌లకు బేటింగ్ కోడళ్ళు కానుక రూపంలో నగదు అందజేసి, నాగోబా దర్శించుకున్నారు.

**ఆదివాసీ జాతరలు దేశ సమైక్యతకు ప్రతీకలు...**
ఆదివాసీల ఆరాధ్య దైవమైన కేస్లాపూర్ నాగోబా జాతరలో కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొనడం దేశ సమైక్యతకు, గొప్ప సంస్కృతికి నిదర్శనమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మంగళవారం ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడుతూ, నాగోబా ఆలయంతో పాటు ఈ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, భవిష్యత్తులో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు, మెస్రం వంశస్తులు, పూజారుల సూచనల మేరకు అభివృద్ధి పనులు చేపడతామన్నారు. సాగునీరు, తాగునీరు కోసం నిధులు కేటాయించేలా ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారనీ తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతమైన బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న అటవీ ప్రాంతంలోని పురాతన దేవాలయాలను గుర్తించి, వాటిని అభివృద్ధి చేసే అంశంపై మంత్రివర్గంలో చర్చించడం జరిగిందని, గోదావరి పుష్కరాల నాటికి ఈ దేవాలయాలను కలుపుతూ ఒక పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేసి, భక్తులకు వసతులు కల్పించే ఆలోచనలో ప్రభుత్వం ఉందనీ అన్నారు. ఆదివాసీలు చెట్లను, పుట్టలను, నీటిని, జంతువులను పూజించడం ద్వారా ప్రకృతిని కాపాడుకుంటున్నారనీ, మెస్రం వంశస్తులు గంగాజలం తెచ్చి, ఎంతో నిష్ఠతో సంప్రదాయాలను పాటిస్తూ ఈ జాతరను నిర్వహించడం అభినందనీయమన్నారు. నాగోబా జాతర ఈ నెల 25తో ముగుస్తుండగా, 28వ తేదీన ఆసియాలోనే అతిపెద్దదైన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర ప్రారంభమవుతుందని, ఈ మహా జాతరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు, భక్తులు, అధికారులు అందరూ తరలిరావాలని మంత్రి సీతక్క ఆహ్వానించారు. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు మంత్రినీ శాలువాతో సత్కరించి, నాగోబా చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటిడిఏ పీఓ యువరాజ్ మర్మాట్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మెస్రం వంశీయులు పాల్గొన్నారు.











# రోడ్డు భద్రతే లక్ష్యం.. 'అరైవ్ అలైవ్'తో వినూత్న ప్రచారం



**గాలిపటాలు ఎగురవేసిన ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి**

**నిర్మల్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ప్రతిపాదించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమం మంగళవారం నిర్మల్ జిల్లా ఐడిఓసి ప్రాంగణంలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై 'అరైవ్ అలైవ్' నినాదాలు రాసిన గాలిపటాలను ఎగురవేసి ప్రజలకు వినూత్నంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డిఫెన్సివ్ డ్రైవింగ్ ఏకైక మార్గమని స్పష్టం చేశారు. వాహనదారులు వేగ నియంత్రణ పాటించడంతో పాటు, రోడ్డుపై ప్రయాణించే ఇతరుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని మంత్రి సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా అమూల్యమైన ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ చేపడుతున్న ఈ అవగాహన ఉద్యమం ప్రజల్లో మంచి మార్పు తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాల తీవ్రతను తగ్గించేందుకు సాంకేతికతతో పాటు అవగాహన కార్యక్రమాలను సమాంతరంగా అమలు చేస్తున్నామని తెలిపారు. వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్పీ సాయి కిరణ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేదలకు వరం సీఎం సహాయనిధి

**గుడిహత్నూర్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
గుడిహత్నూర్ మండలం డోంగర్గావ్ గ్రామనికి చెందిన మంజులకు మంజూరైన రూ.60.000 విలువగల సీఎం సహాయనిధి చెక్కును మంగళవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదేశాల మేరకు లబ్దిదారులకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, డోంగర్గావ్ సర్పంచ్ ఇమ్రాన్ అందించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం ఈ సాయం అందించిందన్నారు.






# దారికాచిన మృత్యువు

- లారీలోని ఐరన్‌డోమ్‌ను ఢీకొట్టిన కారు
- ప్రమాద స్థలిలోనే నలుగురి దుర్మరణం
- భైంసాలో అర్ధరాత్రి మృత్యుఘోష
- మృతుల్లో ముగ్గురు కుప్టివాసులు
- ప్రాణాపాయ స్థితిలో గ్రామ సర్పంచ్ గంగాధర్
- నిజామాబాద్ ఆసుపత్రికి తరలింపు
- హైదరాబాద్ వెళ్లి తిరిగివస్తుండగా ఘటన
- ఘటనాస్థలినిత పరిశీలించిన ఎస్పీ జానకీ షర్మిల
- కుప్టి గ్రామంలో తీరని విషాదం ఛాయలు

**ముథోల్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**

కుభీర్ మండలంలోని కుప్టి గ్రామం అంటే కేవలం ఇళ్లు, మనుషుల సమూహం మాత్రమే కాదు.. అదొక పెద్ద ఉమ్మడి కుటుంబం. గ్రామంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా, ఏ శుభకార్యం జరిగినా 'మేమంతా ఉన్నాం' అంటూ గ్రామ పెద్దలు ముందుండి నడిపించడం అక్కడ దశాబ్దాలుగా వస్తున్న ఆచారం. అదే మానవీయత ఇప్పుడు ఆ గ్రామంలో తీరని శోకాన్ని మిగిల్చింది. ప్రాణం ఇచ్చే బంధం.. ప్రాణం తీసిన విధి వారిని వెంటాడింది.. ఆపదలో అండగా నిలవాలనుకొని.. గ్రామానికి చెందిన ఒక చిన్న బాలుడు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. తమ ఊరి బిడ్డ కోలుకోవాలని, ఆ తల్లిదండ్రులకు ధైర్యం చెప్పాలని కొత్తగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ పెద్దలు నిర్ణయించుకున్నారు. అధికారం చేతిలో ఉంది కదా అని విర్రవీగకుండా, ఒక బాధ్యతగల కుటుంబ సభ్యుల్లా కారులో హైదరాబాద్ వరకు వెళ్లారు. "తమ ఊరి బిడ్డ క్షేమం కోసం వెళ్లిన ఆ పెద్దలు, తిరిగిరాని లోకాలకు వెళ్తారని ఎవరూ ఊహించలేదు." సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత, పరామర్శ ముగించుకొని తిరిగి వస్తుండగా భైంసా పట్టణ శివారులోని సాత్పూల్ వంతెన వద్ద విధి వంచించింది. చీకటిని చీల్చుకుంటూ వస్తున్న కారుకు, ఎదురుగా వస్తున్న లారీలోని ఐరన్ డోమ్ మృత్యుపాశంలా మారింది. కారు పైభాగం గుర్తుపట్టలేనంతగా నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు గ్రామ పెద్దలు అక్కడికక్కడే





ప్రాణాలు కోల్పోయారు. ఎడమవైపు ఎయిర్ బ్యాగ్‌లు తెరుచుకోవడంతో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. ఒకరి కష్టాన్ని తమ కష్టంగా భావించి, ఆపదలో ఉన్నవారికి ధైర్యం చెప్పడానికి వెళ్లిన ఆ నలుగురు నేడు భౌతికంగా లేరు. కుప్టి గ్రామస్తుల మధ్య ఉన్న ఆ నిఖార్సైన మానవత్వం, ఐక్యత ఈ ఘటనతో మరోసారి ప్రపంచానికి తెలిసినా, దానికి వారు చెల్లించిన మూల్యం మాత్రం చాలా పెద్దది. ఆ కుటుంబాలకు, గ్రామానికి జరిగినలోటు పూడ్చలేనిది.

నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని సాత్‌పూల్ వంతెనపై సోమవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నిర్మల్ నుంచి నాందేడ్ మార్గం వైపు వెళ్తున్న కంటైనర్ లారీ, నిజామాబాద్ వైపు నుంచి భైంసా పట్టణంలోకి వస్తున్న ఎర్టికా వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎర్టికా వాహనంలో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

కుభీర్ మండలంలోని కుప్టి సర్పంచ్ గంగాధర్‌తో పాటు మరో ఐదుగురు గ్రామస్తులు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గ్రామస్తుడిని పరామర్శించేందుకు సోమవారం ఉదయం బయలుదేరి వెళ్లారు. వీరందరూ రాత్రి పూట అక్కడి నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. మరికొద్ది నిమిషాల్లో భైంసాకు చేరుకునే సమయంలో వారి కారు ప్రమాదానికి గురైంది. ఎదురుగా వచ్చిన కంటైనర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కుభీర్ మండల కేంద్రానికి చెందిన ఎర్టికా వాహన డ్రైవర్ బొప్ప వికాస్(24)తో పాటు అందులో ప్రయాణిస్తున్న భోజరామ్ పటేల్(42), కొడిమెల పెద్ద రాజన్న (62), బోయిడి బాబన్న (65)లు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఇక మధ్య సీట్లో కూర్చున్న గ్రామ సర్పంచు గంగాధర్ తీవ్రంగా గాయపడ్డాడు. సిందే ఆనంద్ రావ్, గుండోల్ల లక్ష్మణ్(చిన్ను) స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిన సర్పంచ్ గంగాధర్‌ను భైంసాలోని ప్రైవేటు



ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న భైంసా ఏఎస్పీ రాజేశ్ మీనా, సీఐ సాయికుమార్‌లు ఘటనాస్థలికి చేరుకుని వాహనంలో చిక్కుకున్న మృతదేహాలను స్థానికుల సహాయంతో బయటకు తీయించారు. అయితే తీవ్రమైన ప్రమాదం కారణంగా బోయిడి బాబన్న శరీరం నుంచి తల తెగిపోవడం ప్రమాద తీవ్రతను సూచిస్తోంది. మృతదేహాలను ట్రాలీ ఆటోలో పోస్టు మార్గం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## ముగ్గురూ ఊరి పెద్దలు..

కుప్టి గ్రామానికి చెందిన భోజరాం పటేల్‌తో పాటు కొడిమెల రాజన్న, బోయిడి బాబన్న, సిందే ఆనంద్‌రావు గ్రామంలో పెద్ద మనుషులుగా వ్యవహరిస్తుంటారు. అనుకోని ప్రమాదం ముగ్గురిని కబళించింది. మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. భోజరాంపటేల్ గ్రామంలోనే ఉంటూ భైంసా పట్టణంలో వ్యాపారం చేసేవాడు. ఇతనికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కొడిమెల రాజన్న, బోయిడి బాబన్న బోయి బాబన్న గ్రామంలోనే వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఘోర రోడ్డు ప్రమాదం తమ ఇంటి పెద్దలను బలిగొనడంతో ఆ కుటుంబాల రోదన వర్ణనాతీతం. ఇక తాజాగా సర్పంచ్ ఎన్నికైన గంగారాం పేద కుటుంబానికి చెందినవారు. ఇటీవల గ్రామంలో ఎస్సీ రిజర్వేషన్ రావడంతో గ్రామపెద్దలు ముందుండి అతన్ని గెలిపించుకున్నారు. రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయం కావడంతో వైద్యులు బ్రెయిన్ సర్జరీ చేశారు.

## పెళ్లి కావాల్సిన ఇంట..

కుభీర్కు చెందిన బొప్ప చంద్రబాయి- నాగలింగం దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్దకుమారుడు వినోద్ ఆర్మీలో పని చేస్తుండగా, మూడో కుమా రుడు వివేక్ డిగ్రీ చదువుతున్నాడు. రెండో కుమారుడైన వికాసి మిషన్ భగీరథలో వాహనం డ్రైవర్గా పనిచేస్తున్నాడు. ఖాళీ సమయంలో తన సొంతకారును అద్దెకు నడుపుతున్నాడు. సోమవారం కుప్టి గ్రామస్తులతో హైదరాబాద్ వెళ్లాడు. తిరిగి వస్తుండగా రోడ్డుప్రమా దంలో మృత్యువాత పడ్డాడు. పెళ్లి జరగాల్సిన ఆ ఇంట్లో చావు మేళం మోగింది. పచ్చని పందిరితో కళకళలాడాల్సిన చోట విషాదం అలుముకుంది.

## ఘోర రోడ్డు ప్రమాదంలో వీరిద్దరు మృత్యుంజయులు...

**బెలూన్ తెరుచుకోవడంతో ముందు సీటులోని వ్యక్తి తప్పిన ముప్పు - మధ్య సీట్ ఎడమ వైపు ప్రమాద తీవ్రత లేక మరో వ్యక్తి సురక్షితం**



భైంసా పట్టణ ప్రాంతంలోని సుద్దవాగు వంతెనపై సోమవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. డ్రైవర్ తో సహా ఎరిటికా వాహనంలో ప్రయాణీస్తున్న ఏడుగురు వ్యక్తులు ప్రమాదం బారిన పడ్డారు. ఘటనలో నలుగురు వ్యక్తులు దుర్మరణం పాలవ్వగా మరో వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతూ కొట్టుమిట్టాడుతున్నాడు. అయితే ఇదే ఘటనలోని ఇద్దరు వ్యక్తులు మాత్రం సురక్షితంగా బయటపడి మృత్యుంజయులుగా మారారు. నాందేడ్ రోడ్డు మార్గం మీదుగా భైంసా పట్టణంలోకి వస్తున్న ఏరిటికా వాహనం, నిర్మల్ వైపు నుంచి నాందేడ్ రోడ్డు వైపు వెలుతున్న ట్రాలీ లారీ సుద్దవాగు వంతెనపై ఢీకొట్టుకున్నాయి. ఈ ఘటనలో కుభీర్ మండల కేంద్రానికి చెందిన వాహన డ్రైవర్ వికాస్ బొప్పతో పాటు మండల పరిధిలోని కుప్టి గ్రామానికి చెందిన బోజరామ్ పాటిల్, కొడిమెల పెద్ద పోతన్న. బోయిడి రాజన్నలు దుర్మరణం పాలయ్యారు. ఇక ఇదే ఘటనలో కుప్టి గ్రామ సర్పంచు గంగారాం తీవ్ర గాయాలతో ప్రాణపాయ స్థితితో కొట్టుమిట్టాడుతున్నాడు. కాగా ఘటనలోని ఏరిటికా వాహనంలో ప్రయాణిస్తున్న కుప్టి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మాత్రం సురక్షితంగా బయటపడ్డారు. డ్రైవర్ పక్క సీటులో కూర్చున్న సిందే ఆనంద్ రావ్ పాటిల్ ప్రమాద సమయంలో బెలూన్ తెరుచుకోవడంతో సురక్షితంగా బయటపడ్డారు. ఇక మధ్య సీటులో ఎడమ పక్క చివరన కూర్చున్న లక్ష్మణ్ అనే యువకుడు సైతం ప్రమాదంలో ఎలాంటి గాయాల బారిన పడకుండా ప్రమాదం ను0చి సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాద తీవ్రత వాహనానికి కుడి వైపు మాత్రమే ఉండటంతో పాటు ఎడమ వైపు కూర్చున్న వీరద్దరు బెలూన్ తెరుచుకోవంతో వీరద్దరు మృత్యుంజయలుగా బయటపడ్డారు. ప్రమాద స్థలితో పాటు ఏరియా ఆసుపత్రి వద్ద ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడ్డ సిందే ఆనందరావ్ పాటిల్, లక్ష్మణ్ అందరూ మృత్యుంజయులుగా పేర్కొన్నారు.

## అత్యవసరమైతేనే రాత్రి ప్రయాణాలు...

రాత్రి వేళల్లో ప్రయాణాలు తగ్గించుకోవాలని, అత్యవసరమైతేనే బయటకు రావాలని ఎస్పీ జానకి షర్మిల హితవులిలికారు. భైంసా ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఆమె ప్రమాద సమాచారం అందగానే పోలీసులు తక్షణం స్పందించి సహాయక చర్యలు చేపట్టారని వివరించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించారు. వాహనదారులు నిబంధనలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలన్నారు.





# మహిమాన్వితం.. బాసర క్షేత్రం..!

చదువుల మాత సరస్వతీ దేవి కొలువై ఉన్న బాసర సరస్వతీ అమ్మవారి క్షేత్రానికి ఉత్సవకళ సంతరించుకుంది. బుధవారం నుండి మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో చివరి రెండు రోజులు భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉంది. ఈ సారి ఉత్సవాలకు హాజరయ్యే భక్తుల కోసం ప్రతిసారిలాగే ఈ సారి కూడా దేవస్థానం ఆధ్వర్యంలో అదనపు క్యూ లైన్లు తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి వసతి వంటి ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయంతో పాటు ఉపఆలయాన్నింటికి రంగురంగు విద్యుత్ దీపాలతో అలంకరించారు.

- నేటి నుంచి 'వసంత' వేడుకలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయాధికారులు
- ఏటా వైభవోపేతంగా ఉత్సవాలు
- భారీగా తరలి రానున్న భక్తులు

**ముథోల్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**

దక్షిణ భారతదేశంలో అత్యంత మహిమాన్విత క్షేత్రంగా పేరొందిన బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయంలో వసంత పంచమి వేడుకలు బుధవారం నుంచి మూడు రోజులపాటు కొనసాగనున్నాయి. మనశ్శాంతి ప్రసాదించే ప్రాంతంగా పేరొందిన ఈ క్షేత్రంలో అమ్మవారి జన్మదినాన్ని ఏటా వైభవోపేతంగా జరుపుతుంటారు. బాసర సరస్వతీ అమ్మవారిని వ్యాసమహర్షి ఇసుకతో ప్రతిష్ఠించినట్లు పురాణాలు చెబుతున్నాయి. పురాణాలు చెబుతున్న ప్రకారం.. భారత యుద్ధాన్ని చూసి చలించిన వ్యాసమహర్షి ప్రశాంత చిత్తంతో తపస్సు చేయడానికి ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నారు. ధ్యానముద్రలో ఉన్న ఆయనకు శక్తిరూపం నీడలా కనిపించి వెనువెంటనే మాయమైంది. దీంతో ఆ రూపం ఎవరిదా..? అని తన దివ్యదృష్టితో చూడగా శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారు కనిపించింది. పూర్తిరూపం కనిపించకపోవడానికి కారణం అడగగా భూలోకంలోని పాపకార్యాల కారణంగా ఇక్కడ పూర్తి రూపాన్ని చూపెట్టలేకపోతున్నానని అమ్మవారు చెప్పింది. ప్రతీరోజు గోదావరిలో ధ్యానం చేసి పిడికెడు ఇసుకను నచ్చిన స్థానంలో వేయాలని, ఇలా వేసిన ఇసుకతో తన పూర్తిరూపం తయారవుతుందని, అనంతరం జ్ఞాన సరస్వతీగా అందరికీ దర్శనమిస్తానని అమ్మవారు తెలిపింది. ఇలా ఇసుకతో వ్యాసమహర్షి ప్రతిష్ఠించిన సరస్వతీ అమ్మ వారి జన్మదినాన్ని ఏటా జరుపుతారు.

ఈ ఆధునిక యుగంలో చదువే సమస్తానికి మూలం.. విద్యతోనే పిల్లలు సభ్యమానవులై, మంచి జీవితాన్ని గడపగలుగుతారు. కవి, లేఖకుడు, సమీక్షకుడు, ఆలోచనాపరుడు, పాఠకుడు, గాయకుడు, సంగీతజ్ఞుడు, తార్కికుడు, అధ్యాపకుడు, ప్రవక్త, ఉపదేశకుడు, జ్యోతిష్కుడు, వక్త మొదలైన వారందరికీ కావలసింది మంచి విద్య, వాక్పటుత్వం. వాక్చాతుర్యం ద్వారానే వ్యక్తులు ఇతరులపై ప్రభావం చూపగలుగుతారు. సంగీత, ఇతర లలిత కళలకు కూడా సరస్వతి అధిష్ఠాన దేవత. పవిత్రంగా, మన:పూర్వకంగా, నిర్మలమైన మనస్సుతో ఆరాధిస్తేచాలు ఆ చదవులమ్మ ప్రసన్నమై కోరిన విద్యలు ప్రసాదిస్తుంది. సరస్వతీ దేవి సకల విద్యాస్వరూపిణి. మనం నోటితో ఏదైనా మధురంగా మాట్లాడుతున్నామంటే అది ఆ తల్లి చలవే.. ఆమె అంతర్వాహినిగా ఉండటం వల్లే మనలో మేధాశక్తి పెంపొందుతుంది. ఆమె అనుగ్రహం లేకపోతే అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడవలసిందే.. అందుకే ఆ చల్లని తల్లి అనుగ్రహం ప్రతి ఒక్కరికీ అవసరం. వాక్కు, బుద్ధి, విద్య, జ్ఞానాలకు, భాషకు, లిపికి అధిష్ఠాన దేవత సరస్వతీ దేవి. ఆమె వీణా పుస్తక ధారిణి. శుద్ధ సత్వ స్వరూపిణి. హంస ఆమె వాహనం. సరస్వతి బ్రహ్మదేవుని నాలుకయందు నివసిస్తుంది.. పలుకు తేనెల బంగారు తల్లి. వేదాలకు జనయిత్రి. తెల్లని వన్నెలు విరజిమ్ముతూ, తెల్లని వస్త్రాలు ధరించి, వీణ, పుస్తకాలు చేదాల్చి, రత్నభూషణాలు మెడలో ధరించి, సకల శాస్త్రాలకూ ఆది దేవత అయిన సరస్వతీదేవి ఆవిర్భవించింది. ఆమె దయ ఉంటే మూర్ఖుడు సైతం పండితుడు కాగలడు.. ఆమెను తృణీకరించిన మహాపండితుడు సైతం జ్ఞానభ్రష్టునిగా, వివేకశూన్యునిగా మారి సర్వం పోగొట్టుకుని పిచ్చివాడయిపోతాడు. అందుకే ఆ తల్లి కరుణ కోసం పరిపరివిధాల ప్రాధేయపడదాం.

**సరస్వతీ దేవి ఇతర నామాలు...**

సరస్వతీ దేవి పలు నామాలతో విలసిల్లుతోంది. భారతి, మహావిద్య, వాక్, మహావాణి, ఆర్య, బ్రాహ్మి, కామధేను, బీజగర్భ, వీణాపాణి, శారద, వాగీశ్వరి, గాయత్రి, వాణి, వాగ్దేవి, విద్యావాచస్పతి తదితర నామాలున్నాయి..

**అక్షరాభ్యాసానికి అనుకూలం...**

విద్యారంభానికి మంచి ముహూర్తం ఉత్తరాయణం. అంటే మా ఘ, ఫాల్గుణ, చైత్ర, వైశాఖ, జ్యేష్ఠమాసాల్లో శుక్లపక్షంలో విదియ, తదియ, పంచ మి, దశమి, ఏకాదశి, త్రయోదశి తిథులు,అశ్వని, మృగశిర, ఆర్ద్ర, పునర్వసు, పుష్యమి, హస్త, చిత్త, స్వాతి, అనూరాధ, శ్రవణం, ధనిష్ఠ, శతభిషేకం, రేవతి నక్ష త్రాలు శ్రేష్ఠం. మంగళ,శనివారాలు తప్ప వారాలన్నీ మంచివేనని విరచిత ధర్మసింధు పేర్కొంది.

యా కుందేందు తుషారహార
ధవళా యా శుభ్ర వస్త్రాన్వితా
యా వీణా వరదండ మండిత
కరా యా శ్వేత పద్మాసనా
యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతి
భిర్దేవైస్సదా పూజితా
సామాం పాతు సరస్వతీ
భగవతీ నిశ్శేష జాడ్యాపహా

అని స్థుతిస్తాం సరస్వతీ దేవిని. ఆ తల్లిని పూజిస్తే బుద్ధి వికాసం కలుగుతుందని, సకల శుభాలూ సమకూరుతాయని భక్తుల విశ్వాసం.



**ఇష్టమైన నైవేద్యాలు...**

వెన్న, పెరుగు, పాలు, వరి లేదా జొన్న పేలాలు, నువ్వుండలు(తెల్లవి), బెల్లం, తేనే, మిఠాయి, చెరకు ముక్కలు, తెల్లధాన్యాల అటుకులు, అన్నం, తెల్లని లడ్లు, బియ్యము, గోధుమ పిండితో చేసిన నేతి పిండివంటలు, అరటిపళ్లు, పటిక బెల్లం, నేతి పాయసం, కొబ్బరికాయ, కొబ్బరినీరు, రేగుపండ్లు. బాసరలో జ్ఞాన సరస్వతీ దేవి ఆలయం చాలా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. ఇది వేదవ్యాసునిచే ప్రతిష్ఠింపబడిందని స్థల పురాణం చెబుతోంది. సరస్వతీదేవి జన్మదినమైన వసంత పంచమి నాడే కాక సంవత్సరం పొడవునా ఇక్కడ అక్షరాభ్యాసాలు ఎక్కువగా జరుగుతుంటాయి.





## పకడ్బందీ ఏర్పాట్లు చేశాం



బాసరలో అమ్మవారి ఆలయంలో వసంత పంచమి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం. భక్తులకు మెరుగైన వసతులు కల్పించాం. భక్తులు దర్శనానికి వెళ్లేందుకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాం. పకడ్బందీ పోలీస్ బందోబస్తు చర్యలు చేపడతాం. చిన్నారులకు పాలు, బిస్కెట్లు, పండ్లు, భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తాం. అన్ని శాఖల అధికారుల సమన్వ యంతో పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. నేటి నుంచి ఈ నెల 23వరకు వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం. వసంత పంచమి రోజున లక్షకు పైగా భక్తులు వచ్చే అవకాశముంది. సరిపడా ఏర్పాట్లు చేశాం.

*-అంజనీదేవి, ఆలయ ఈవో*

# పకడ్బందీ పోలీసు బందోబస్తు ఏర్పాటు



- పంచమి వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ
- బారికేడ్లు, బందోబస్తు, పార్కింగ్ ఏర్పాట్లపై దృష్టి
- ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు..
- అంవాంఛనీయ ఘటనలు జరగకుండా నిఘా
- నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ రాజేష్..

నేటి నుంచి 23న వరకు బాసరలో జరగనున్న వసంత పంచమి వేడుకల నేపథ్యంలో జిల్లా ఎస్పీ డా.జానకి షర్మిల, ఆలయ పరిసర ప్రాంతాలను మంగళవారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా భారీకేడ్లు, ప్రత్యేక క్యూలైన్ వ్యవస్థ, భద్రతా ఏర్పాట్లు, బందోబస్తు విధులు పకడ్బందీగా అమలు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, పిల్లలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, వాహనాలరద్దీ కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక సిబ్బందిని నియమించి, రూట్ మ్యాపింగ్ చేసి వాహనాలను దారి మళ్లించే విధంగా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ అంజనీ దేవితో మాట్లాడిన జిల్లా ఎస్పీ, క్యూ లైన్ల నిర్వహణ, లడ్డు కౌంటర్ల వద్ద రద్దీ నియంత్రణ, వంటి అంశాలపై చర్చించారు. వసంత



పంచమి సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, శాంతి భద్రతల పరిరక్షణకు తగిన బలగాలతో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ, భక్తులకు సురక్షిత వాతావరణంలో దర్శనం కల్పించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ తెలిపారు. ఎస్పీ వెంట భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా తదితరులున్నారు.

## నేడు 'గరికపాటి' రాక

బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త డాక్టర్ గరికపాటి నరసింహారావు రానున్నట్లు ఆలయ ఈవో అంజనీదేవి తెలిపారు. శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి దర్శనం అనంతరం ఉదయం 10నుంచి 12గంటల వరకు శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయ విశిష్టత, వ్యాస భగవానుని ప్రతిష్టాపన గురించి భక్తులకు ఆయన ప్రవచిస్తారు.



# నేడు, రేపు జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి పర్యటన



**ఆదిలాబాద్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ నెల 21, 22 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారు. బుధవారం మధ్యాహ్నం 2.30గంటలకు జగిత్యాల జిల్లా ధర్మపురి నుంచి బయలుదేరి సాయంత్రం 4గంటలకు ఉట్నూర్ మండలం ధంతన్‌పల్లి గ్రామానికి చేరుకుంటారు. అక్కడ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడుతారు. అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం 4.35 గంటలకు పులిమడుగు గ్రామానికి చేరుకుంటారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్, 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణాలకు భూమి పూజ చేయనున్నారు. అక్కడి నుంచి కుమ్మరితండాకు చేరుకుని గ్రామస్తులతో సమావేశమవుతారు. అనంతరం ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌కు చేరుకుని సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. ఈ నెల 22న కేస్లాపూర్‌లో నిర్వహించనున్న గిరిజన దర్బార్‌లో మంత్రి సీతక్కతో కలిసి పాల్గొననున్నారు.



**దంతన్‌పల్లిని సందర్శించిన కలెక్టర్...**
డిప్యూటీ సీఎం జిల్లా పర్యటన నేపథ్యంలో మండలంలోని దంతన్‌పల్లి, కుమ్మరితండాలో ఏర్పాట్లను కలెక్టర్ రాజర్షిషా మంగళవారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్, ఎంపీడీవో రాంప్రసాద్, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, అధికారులు తదితరులున్నారు.



# నూతన సర్పంచులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

## రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ సీతక్క



**ఉట్నూర్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ సీతక్క సూచించారు. మంగళవారం రాత్రి నాగోబా దేవున్ని దర్శించుకున్న తర్వాత మండల సర్పంచులు మంత్రి సీతక్కని సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పంచాయితీ రాజ్ చట్టంపై సర్పంచులకు పూర్తి స్థాయి అవగాహన ఉండేవిధంగా నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను సర్పంచులు సద్వినియోగం చేసుకొని, పంచాయతీ రాజ్ చట్టం ప్రకారంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యేలు మంత్రుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరిం చుకోవాలని ఉన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# మంచిర్యాల జిల్లాలో సీఐల బదిలీ

**మంచిర్యాల, జనవరి 20 (ప్రభాత సమాచారం)**




మంచిర్యాల జిల్లా పరిధిలో పలువురి సీఐలను బదిలీ చేస్తూ మంగళవారం రామగుండం కమిషనరేట్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. బదిలీ ఆయిన వారిలో మందమర్రి సీఐగా విధులు నిర్వహించిన కలర్ల శశిధర్ రిపోర్ట్ ఇన్ ఓ/ఓది ఐజీపీ, మల్టీ జోన్-1 హైదరాబాద్‌కు, కరీంనగర్ ట్రాఫిక్-2 పీఎస్ నుంచి పర్స రమేశ్ మందమర్రి సీఐగా రానున్నారు. చెన్నూర్ రూరల్ (కోటపల్లి) సీఐ బన్సీలాల్, ఎస్‌హెచ్‌వో చెన్నూర్ టౌన్‌కు, చెన్నూర్ టౌన్ సీఐగా విధులు నిర్వహించిన పొలినేని దేవేందర్ రావు రిపోర్ట్ ఇన్ ది ఐజీపీ మల్టీజోన్ హైదరాబాద్‌కు, చెన్నూర్ రూరల్ సీఐగా రామగుండం లీగల్ సేల్‌లో విధులు నిర్వహిస్తున్న రాసూరి కృష్ణ బదిలీపై రానున్నారు.

# మరోసారి గుర్తింపు సర్వే

**ఆదిలాబాద్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలో చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా దుకాణాలు, ఇళ్లు కోల్పోయే వారి గుర్తింపునకు అధికారులు మంగళవారం సర్వే చేపట్టారు. గతంలోనే సర్వే నిర్వహించి బ్రిడ్జి నిర్మాణంలో కోల్పోయే ఇళ్లు, దుకాణాలకు మార్కెట్ కూడా ఇచ్చారు. అయితే పలువురి దుకాణాలు అప్పటి సర్వేలో తప్పిపోయినట్లుగా బాధితులు అధికారులకు నివేదించారు. దీంతో ఆర్అండ్‌బీ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖ అధికారులు స్థానిక ఆర్టీవో కార్యాలయ సమీపంలో ఆర్వోబీ నిర్మాణంలో కోల్పోయే దుకాణాల గుర్తింపునకు మరోసారి సర్వే చేశారు. హద్దులు ఏర్పాటు చేశారు. ఆర్‌యూబీ, ఆర్వోబీ నిర్మాణంలో ఆస్తులు కోల్పోయే వారికి వారం రోజుల్లో పరిహారం అందనున్నట్లుగా ఆర్అండ్‌బీ డీఈ ప్రవీణ్ తెలిపారు.



## మహిళల అభ్యున్నతికి

# ప్రజాప్రభుత్వం కృషి

## మంత్రి వివేక్ వెంకట స్వామి

**చెన్నూర్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తుందని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి అన్నారు. మంగళ వారం చెన్నూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు చీరలను డీఆర్డీఓ కిషన్ తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు ఇంకా ఎక్కువ కష్టపడి ఉన్నతి సాధించాలని, మహిళలు ఆర్థికంగా ఎదగడానికి కాంగ్రెస్ ప్రభు త్వం వడ్డీ లేని రుణాలను అందిస్తుందన్నారు. చెన్నూర్ లో మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఒక పెట్రోల్ బంక్ కూడా ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, చెన్నూర్ మున్సిపాలిటీ (మెప్మా)లో మహిళలు ఎక్కువ సంఖ్యలో చేరి ప్రభుత్వ పతకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి నిధులు

**ఖానాపూర్, జనవరి 20 (ప్రభాత సమాచారం)**
ఖానాపూర్ మున్సిపాలిటీలో ప్రజల సౌకర్యం కోసం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కోసం ప్రభుత్వం 15 కోట్ల నిధులు మంజూరు చేసినట్టు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం పట్టణంలో మార్కెట్ నిర్మించే ప్రాంతాలను సందర్శించి అక్కడ చేపట్టవలసిన నిర్మాణాలపై సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు వీలైనంత త్వరగా మార్కెట్ నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌తో పాటు అధికారులు ఉన్నారు.

